ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
Published From Nandyal : Cerculated in Nandyal,Kurnol,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 01 సంచిక -290 పేజీలు - 08 వెల - 06/- బుధవారం 22 జనవరి 2025



## ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ

# ఎన్‌కౌంటర్..!

**ఎదురుకాల్పుల్లో 14 మంది మావోయిస్టులు మృతి**

**చలపతి సహా పలువురు అగ్రనేతలను మట్టుబెట్టిన బలగాలు**

**రాయపూర్,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ):** ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో ప్రధాన మావోయిస్టులు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డ ఉన్నారు. చిత్తూరు జిల్లావాసి అయిన చలపతిపై ప్రభుత్వం గతంలో రూ.కోటి రివార్డు ప్రకటించింది. దీంతో జనవరి 19 రాత్రి నుంచి పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల సంఖ్య 16కు చేరిందని పోలీసులు వెల్లడించారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారు.

మిగతా 2లో



## శాసనసభల గౌరవం

# పెంచేలా చూడాలి

**అవసరమైతే ప్రవర్తనా నియమావళి నిర్దేశించాలి**

**లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా పిలుపు**



పాట్నా,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): శాసనసభల గౌరవం పరిరక్షణ నిమిత్తం రాజకీయ పార్టీలు తమ శాసనకర్తలకు ఒక ప్రవర్తన నియమావళిని నిర్దేశించాలని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా పిలుపు ఇచ్చారు. పాట్నాలో 85వ అఖిల భారత సభాపతుల సమ్మేళనం ముగింపు సెషన్‌లో మంగళవారం ఓమ్ బిర్లా ప్రసంగిస్తూ, రెండు రోజుల సంప్రదింపుల అనంతరం చర్చకు ప్రధాన కేంద్రంగా శాసనసభలను చేయాలని సభాపతులు తీర్మానించారని తెలియజేశారు. 'శాసనసభల గౌరవం పరిరక్షణలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి. రాజకీయ పార్టీలు తమ శాసనకర్తల కోసం ప్రవర్తన నియమావళిని రూపొందించినప్పుడే ఇది సాధ్యం అవుతుంది' అని బిర్లా స్పష్టం చేశారు. పలు శాసనసభలలో పదే పదే అంతరాయాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ వినియోగం ద్వారా శాసనసభల పని తీరులో మరింత సామర్థ్యాన్ని తీసుకురావలని కూడా సభాపతులు తీర్మానించినట్లు లోక్‌సభ స్పీకర్ వెల్లడించారు. మిగతాది 2లో...

## స్వయం ఉపాధి రుణాలకు లబ్దిదారులు

# తమ వాటా చెల్లించక్కర్లేదు

**నూతన మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం**

**యూనిట్ వ్యయంలో 50 శాతం రాయితీ, మిగతా మొత్తం బ్యాంకు రుణం**

అమరావతి,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): మొత్తంగా ఈ ఏడాది స్వయం ఉపాధి రాయితీ రుణ పథకం కింద 1.30 లక్షల మంది బీసీలు, 59వేల మంది ఈడబ్ల్యుఎస్ వర్గాలకు లబ్ది చేకూరనుంది. ఇంతకు ముందు ఈ పథకాలకు ఎంపికైన వారు లబ్దిదారుల వాటా కింద కొంత మొత్తం పెట్టుబడిగా పెట్టేవాళ్లు. ఆ తర్వాత ఆ సొమ్ము ప్రభుత్వం రాయతీపై ఇచ్చేది. మరి కొంత బ్యాంకు రుణంగా ఇప్పించేది. కానీ ఇప్పుడు తాజా మార్గదర్శకాల ప్రకారం లబ్దిదారులు తమ వాటా భరించాల్సిన అవసరం లేదు. యూనిట్ వ్యవస్థాపక వ్యయంలో ప్రభుత్వ రాయితీ పోను, మిగతా మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణంగా ఇకపై అందించనుంది. మిగతాది 2లో...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ANDHRA PRADESH
సత్యమేవ జయతే



# పునరుత్పాదక ఇంధన రంగంలో గణనీయమైన ప్రగతి

**కర్బన ఉద్గారాల నియంత్రణకు క్లీన్ ఎనర్జీ ఏకైక పరిష్కారం**

**సంప్రదాయేతర ఇంధన రంగంలో పెట్టుబడులే లక్ష్యం**

**దావోస్ వేదికగా చర్చల్లో మంత్రి లోకేశ్ స్పష్టీకరణ**

దావోస్,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా దావోస్ వెళ్లిన ఏపీ మంత్రి నారా లోకేశ్ వరుస సమావేశాల్లో పాల్గొంటున్నారు. డబ్ల్యూఈఎఫ్ వేదికగా స్వనీతి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. మిగతాది 2లో...



2లో

## కశ్మీర్ లో ఉగ్రవాదుల కాల్పులు..

# ఏపీ జవాన్ మృతి

- సోమవారం ఉగ్రవాదులు, జవాన్ల మధ్య ఎదురుకాల్పులు
- ఏపీ జవాను కార్తీక్ కు బుల్లెట్ గాయాలు
- చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస
- జవాన్ కార్తీక్ మృతి పట్ల చంద్రబాబు, జగన్ సంతాపం

## టాలీవుడ్‌లో కలకలం..

**దిల్‌రాజు ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ దాడులు**



2లో



## డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దు

**: జనసేన కేంద్ర కార్యాలయం**

**కూటమిలో కలకలం రేపుతున్న డిప్యూటీ సీఎం అంశం**

**దీనిపై మాట్లాడొద్దని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన టీడీపీ**

**సోషల్ మీడియాలో కూడా స్పందించవద్దని జనసేన ఆదేశం**

అమరావతి,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): డిప్యూటీ సీఎం అంశం ఏపీ రాజకీయల్లో కలకలం రేపుతోంది. కూటమి ప్రభుత్వ పాలన ప్రశాంతంగా కొనసాగుతున్న తరుణంలో... నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలంటూ కొందరు టీడీపీ నేతలు చేసిన డిమాండ్ చర్చనీయాంశంగా మారింది. ఈ డిమాండ్ లేవనెత్తుతున్న టీడీపీ నేతల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో జనసేన నేతలు కూడా సీన్ లోకి ఎంటర్ అయ్యారు. మిగతాది 2లో...

# గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఎపి

**సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యం**

**- దావోస్ సదస్సులో చంద్రబాబు వివరణ**

దావోస్,,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): సంప్రదాయేతర ఇంధన వనరులపై తమ ప్రభుత్వం అధిక దృష్టి సారించిందని, గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సౌర, పవన విద్యుత్‌తో పాటు హైడ్రోజన్ ఎనర్జీ హబ్‌గా ఎపి మారబోతోందని అన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ పై నిర్వహించిన సదస్సులో సీఎం మాట్లాడారు. మిగతాది 2లో...





# జనసేనకు గుర్తింపు

**కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీగా జనసేన**

-జనసేనకు గాజు గ్లాసు గుర్తు రిజర్వ్ చేసిన ఎన్నికల సంఘం

2లో

# సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యం

## గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఎపి అవతరణ - దావోస్ సదస్సులో చంద్రబాబు వివరణ

(మొదటి పేజి తరువాయి)

భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ దేశాలకు భారతీయులు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 'మీ అందర్నీ చూస్తుంటే నాలో నమ్మకం పెరిగింది. భవిష్యత్‌లో నా కలలు నిజమవుతాయనే నమ్మకం కలిగింది. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందింది. భారత్‌లో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశాం. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. 25 ఏళ్ల కిందట బిల్‌గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణలను వినియోగించి రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టాను. 1999లో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఆ సంస్కరణలు తీసుకువచ్చినందుకు ఎన్నికల్లో ఓడిపోయా. ఇప్పుడు ఆ విధానాలే ప్రజలకు అనుకూలంగా, అత్యుత్తమంగా మారిపోయాయని అన్నారు. 2014లో మరోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక సౌర విద్యుత్‌పై ఎక్కువ దృష్టి పెట్టాం. ఇప్పుడు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌర ఉత్పత్తి చేయాలని ఓ విధాన నిర్ణయం ప్రకటించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టాం. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తిపైనా ఏపీలో ఎక్కువ దృష్టి పెట్టాం. 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఇంధన వనరుల్లో వస్తున్నాయి. 500 మెగావాట్ల , 5 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాం. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ-ఏపీ జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతు న్నాయి. ఏపీ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారబోతోంది. ఏపీలో విద్యుత్ ఉత్పాదనకు మంచి అవకాశాలున్నాయి. సుదీర్ఘమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటు లో పోర్టులు ఉన్నాయి. ఈవీ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు ఏపీ ప్రోత్సాహకాలు అందిస్తుంది. పీఎం సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌరఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నాం. అత్యంత తక్కువ ఖర్చుతోనే ఈ విద్యుత్ ప్రజలకు అందుబాటులోకి రావాలి. ఓవైపు పర్యావరణాన్ని సంరక్షిస్తూనే ఈ విద్యుత్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాల్సి ఉంది. రాష్ట్రంలో ఆర్గానిక్ వ్యవసాయంపైనా దృష్టి పెట్టాం. గ్లోబల్ కమ్యూనిటీ కోసం ఏపీ ఓ మంచి మోడల్ అవుతుంది. విధాన రూపకర్తగా ప్రజల ప్రయోజనాల కోసం మాట్లాడుతూనే పరిశ్రమలకూ ప్రోత్సాహకాలు అందిస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసేందుకు ఏపీలో ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాం. ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామికవేత్తలే కనిపిస్తున్నారు. భారతీయులు అందిస్తున్న సేవలపట్ల గర్విస్తున్నాను. భవిష్యత్‌లోనూ ఇదే తరహాలో సేవలు అందించాలి. ప్రపంచంలోని అనేక దేశాల్లో రాజకీయ అనిశ్చితి ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉంది'అని చంద్రబాబు అన్నారు. రెండో రోజు దావోస్‌లో మిట్టల్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, సీఈఓ ఆదిత్య మిట్టల్‌తో సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ సమావేశమయ్యారు. ఆర్సెలర్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా 17.8 మిలియన్ టన్నుల కెపాసిటీతో గ్రీన్ ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయడానికి ఇప్పటికే అంగీకారం కుదిరిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు ముందుకు తీసుకెళ్లే అంశంపై ముఖ్యమంత్రి బృందం చర్చలు



నిర్వహించింది. మరోవైపు వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు ఘనంగా ప్రారంభమైంది. జ్యూరిచ్ కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల ప్రాంతంలో దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో ప్రారంభమైన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా హాజరైన పారిశ్రామిక వేత్తలతో పెట్టుబడుల అవకాశాలు, పొటెన్షియల్ కొలాబరేషన్స్‌పై చర్చించారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్ ప్లీనరీ హాలు లాబీలో ఏర్పాటు చేసిన నెట్ వర్కింగ్ డిన్నర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలను పారిశ్రామిక వేత్తలకు సీఎం చంద్రబాబు వివరించారు.

# పునరుత్పాదక ఇంధన రంగంలో గణనీయమైన ప్రగతి

(మొదటి పేజి తరువాయి)

'పర్యావరణ పరిరక్షణ - వాతావరణ ఉద్యమ భవిష్యత్' అంశంపై సమావేశంలో చర్చించారు. పోర్చుగల్ ప్రధాని, జోర్డాన్ క్వీన్, యునెస్కో సైంటిస్ట్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 'సంప్రదాయేతర ఇంధన రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు ప్రయత్నాలు చేస్తున్నాం. కర్బన ఉద్గారాల నియంత్రణకు క్లీన్ ఎనర్జీ ఏకైక పరిష్కారం. సుస్థిర శక్తి వనరుల్లో ప్రపంచ అగ్రగామి కావడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీ గణనీయమైన ప్రగతి సాధించింది. భారత ప్రభుత్వం ఇటీవల ఏపీలో నాలుగు సోలార్ పార్కులు ప్రకటించింది. హరిత, ఇంధన పర్యావరణ వ్యవస్థ స్థాపనే ఏపీ లక్ష్యం. ఇందుకోసం ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ప్రకటించాం అని అన్నారు. పునరుత్పాదక శక్తి రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ఈ విధానాన్ని తీసుకొచ్చాం. తద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టుల కోసం 29 ప్రాంతాలు గుర్తించాం. ప్రపంచంలోనే అతిపెద్ద ఐఆర్ఈఎస్‌పీ ప్రాజెక్టు ఏపీలో ఉంది. 2030 నాటికి 18 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యంగా పెట్టుకున్నాం. పునరుత్పాదక రంగంలో ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం' అని లోకేశ్ తెలిపారు. బహుళజాతి ఐటీ సంస్థ సిస్కో వైస్ ప్రెసిడెంట్ ఫ్రాన్సిస్‌తో లోకేష్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో సిస్కో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ (ఉఅఅ) ఏర్పాటు చేయాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి పరిసరాల్లో అనువైన స్థలంతో పాటు ప్రతిభ కలిగిన ఐటీ వృత్తి నిపుణులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. అమెరికాలోని భారతీయ ఐటీ వర్క్‌ఫోర్స్‌లో 25 శాతానికి పైగా తెలుగువారే ఉన్నారన్నారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో నైపుణ్యాభివృద్ధి ద్వారా డీప్-టెక్ హబ్‌గా ఏపీని మార్చడంపై దృష్టి సారించినట్లు చెప్పారు.అన్ని విధాలుగా అనుకూలతలు కలిగిన ఏపీలో కంపెనీ తయారీ నెట్‌వర్క్‌ను విస్తరించాలని కోరారు. ఏఐ, నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీలో అత్యంత నైపుణ్యం కలిగిన ఐటీ వర్క్‌ఫోర్స్‌ను రూపొందించడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలని ఫ్రాన్సిస్‌ను కోరారు. లోకేశ్ విజ్ఞప్తిపై ఫ్రాన్సిస్ సానుకూలంగా స్పందించారు. ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై కంపెనీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫిలిప్ మోరిస్ సౌత్ ఈస్ట్ ఆసియా వైస్‌ఛైర్‌పర్సన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో స్మోక్ ఫ్రీ సిగరెట్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ఏపీలోని గుంటూరు అనువుగా ఉంటుందన్నారు. పొగాకు బోర్డు, రైతుల సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఏపీ ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఫిలిప్ మోరిస్ సంస్థ తెలిపింది.

## టాలీవుడ్‌లో కలకలం..

### దిల్‌రాజు ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ దాడులు

జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ):

'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా హిట్‌తో సంబరాలు చేసుకుంటున్న ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్‌రాజుకు ఆదాయపన్నుశాఖ అధికారులు షాకిచ్చారు. ఈ ఉదయం ఆయన ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలకు దిగారు. మొత్తం 55 బృందాలు రంగంలోకి దిగి ఏక కాలంలో 8 చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని దిల్‌రాజు ఇళ్లతోపాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితారెడ్డి నివాసాల్లోనూ తనఖీలు కొనసాగుతున్నాయి. అంతేకాదు, ఆయన వ్యాపార భాగస్వాముల ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహిస్తూ, అనుమానిత పత్రాలను తనఖీ చేస్తున్నారు.

## కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీగా జనసేన

### జనసేనకు గాజు గ్లాసు గుర్తు రిజర్వ్ చేసిన ఎన్నికల సంఘం



అమరావతి,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ):

జనసేన పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని గుర్తింపు పొందిన పార్టీల జాబితాలో చేర్చింది. జనసేనకు గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కల్యాణ్ గారికి లేఖ పంపించింది. సార్వత్రిక ఎన్నికల్లో 100శాతం విజయం నమోదు చేసిన పార్టీగా జనసేన రికార్డు సాధించింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో, 2 లోక్ సభ స్థానాల్లో అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలో జనసేన రికగ్నైజ్డ్ పార్టీగా నిలిచి, గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేసుకొంది.

### స్వయం ఉపాధి రుణాలకు లబ్దిదారులు

## తమ వాటా చెల్లించక్కర్లేదు

(మొదటి పేజి తరువాయి)

యూనిట్ గ్రౌండింగ్‌కు సంబంధించి పర్యవేక్షణకు జిల్లా స్థాయి తనిఖీ బృందాలను ప్రభుత్వం నియమించనుంది. ఈ పథకం కింద ఎంపికైన వారు డాక్యుమెంటేషన్ కోసం బ్యాంకర్ల చుట్టూ తిరగకుండా మొత్తం ప్రక్రియ ఎంపీడీఓలు లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనే పూర్తి చేస్తారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం ఆన్‌లైన్ బెనిఫిషియరీ మానిటరింగ్ అండ్ మేనేజ్ మెంట్ సిస్టమ్ (ఓబీఎంఎంఎస్) అనే వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. దీని ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. అంతే కాకుండా అన్‌లైన్‌లో సొంతంగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. లబ్దిదారుల రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం సంబంధిత బ్యాంకులకు జమ చేయనుంది. యూనిట్లు మంజూరైన తర్వాత నియోజకవర్గ స్థాయిలో మేళాలు నిర్వహించి అందజేస్తారు. లబ్దిదారుల బ్యాంకు రుణ వాయిదాల చెల్లింపును పర్యవేక్షించే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిలో ఒకరికి అప్పగించనున్నారు. ఇక యూనిట్ల అర్హత విషయానికి వస్తే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, వయసు 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు అర్హులు. మినీ డెయిరీ, గొర్రెలు, మేకల పెంపకం, మేదర, కమ్మరి, శాలివాహన కుటుంబాలకు ఆర్థిక సాయం, వడ్రంగి పని వారికి చేయూత, జనరిక్ మందుల దుకాణాలు యూనిట్ల రుణ పథకాలకు వర్తిస్తాయి.

## ఏపీలో 23 వేల కిలోల గోమాంసం పట్టివేత

### అనకాపల్లి జిల్లా వేంపాడు టోల్ ప్లాజా వద్ద గోమాంసం పట్టివేత

అమరావతి,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ):

ఏపీలో 23 వేల కిలోల గోమాంసం పట్టుబడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు టోల్ ప్లాజా వద్ద గోమాంసం పట్టుబడింది. కోల్ కతా నుంచి చెన్నై వెళుతున్న కంటైనర్ ను పోలీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గోమాంసం పట్టుబడింది. గోమాంసాన్ని అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో గోమాంసాన్ని తరలిస్తున్న కంటైనర్ ను పోలీసులు పట్టుకోవడం గమనార్హం.

## నలుపు సిరాతో రాసే చెక్కులు చెల్లవు.. : ఆర్బీఐ క్లారిటీ

**కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్)**




కొత్త ఏడాదిలో కొత్త రూల్.. ఆర్బీఐ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది.. నలుపు సిరాతో రాసే చెక్కులు చెల్లుబాటు కావనే ప్రచారంపై ఆర్బీఐ స్పందించింది. ఆర్బీఐ పేరిట జరుగుతున్న ప్రచారం తప్పని, ఎలాంటి ఉత్తర్వులూ వెలువరించలేదని పేర్కొంది. చెక్కులపై రాతకు సంబంధించి ఆర్బీఐ ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలూ జారీ చేయలేదని స్పష్టంచేసింది.

## ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజి తరువాయి)

ఈక్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిన్న ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా.. తెల్లవారుజామున జరిపిన గాలింపులో మరో 14 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే భారీస్థాయిలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంకా ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. ఇందులో వెయ్యి మంది వరకు భద్రతా సిబ్బంది పాల్గొన్నట్లు తెలుస్తోంది.మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు ఇప్పటికీ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. ఈ ఎన్ కౌంటర్ పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ఇది నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని ఆయన తెలిపారు. ఈ ఎన్ కౌంటర్ నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బ లాంటిదన్నారు. మన భద్రతా బలగాలకు ఇదో గొప్ప విజయం అని అమిత్ షా వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో నక్సలిజం చివరి దశలో ఉందని ఎద్దేవా చేశారు. సీఆర్‌పీఎఫ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బలగాలు ఈ జాయింట్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయని షా చెప్పారు. అయితే, ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో జనవరి 19వ తేదీ రాత్రి నుంచి ఈ ప్రత్యేక ఆపరేషన్ కొనసాగుతుంది. పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 16 మంది మావోలు మరణించగా.. వారిలో కీలక నేతలు కూడా ఉన్నారని అమిత్ షా పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న బలగాలపై ప్రశంసలు జల్లు కురుపించారు. మన భద్రతాదళాలకు ఇది గొప్ప విజయమని, నక్సల్స్ రహిత భారత్ దిశగా ఇది కీలక అడుగు అని కొనియాడారు. ఈ ఎన్ కౌంటర్ కేంద్ర కమిటీ సభ్యులు మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డూ, ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు.

## శాసనసభల గౌరవం పెంచేలా చూడాలి



1947 నుంచి ఇప్పటి వరకు జరిగిన పార్లమెంటరీ చర్చలను రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్‌లో గుర్తించిన 22 భాషల్లో పార్లమెంట్ త్వరలో అందుబాటులోకి తీసుకురాగలదని బిర్లా ప్రకటించారు. శాసనసభలు కూడా 1947 నుంచి జరిగిన చర్చలను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో లభ్యమయ్యేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ఇందు కోసం పార్లమెంటరీ సెక్రటేరియల్ నుంచి సాంకేతిక సహాయం అందజేయగలమని ఆయన హామీ ఇచ్చారు. అఖిల భారత సభాపతుల సమ్మేళనం ముగింపు సెషన్‌క బీహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా, బీహార్ అసెంబ్లీ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్, బీహార్ శాసన మండలి చైర్మన్ అవధేశ్ నారాయణ్ సింగ్ ప్రభృతులు హాజరయ్యారు.

# కశ్మీర్ లో ఉగ్రవాదుల కాల్పులు.. ఏపీ జవాన్ మృతి

జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదులు మరో సైనికుడిని పొట్టనబెట్టుకున్నారు. సోమవారం ఉగ్రవాదులకు, జవాన్లకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ జవాను చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. ఎక్కడికక్కడ పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేసినా, కేంద్ర బలగాలతో నిరంతర పహారా కాస్తున్నా జమ్మూ రీజియన్ లో ఉగ్రమూకలు రెచ్చిపోతూనే ఉన్నాయి. ఉగ్రవాదుల కదలికలపై సమాచారంతో సోమవారం నార్త్ జమ్మూకశ్మీర్ లో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలోనే ఉగ్రవాదులకు, జవాన్లకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన జవాను పంగల కార్తీక్ కు బుల్లెట్ గాయాలయ్యాయి.గాయపడ్డ కార్తీక్ ను తోటి సైనికులు హుటాహుటిన ఆర్మీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. కాగా, చిత్తూరు జిల్లాలోని బంగారు పాల్యం మండలం రాగి మానుపెంట గ్రామానికి చెందిన పంగల కార్తీక్ 2017లో ఆర్మీలో చేరారు. కార్తీక్ మరణవార్తతో రాగి మానుపెంట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కార్తీక్ ఇటీవల దీపావళి పండుగకు ఇంటికి వచ్చి వారం రోజుల పాటు ఊరిలో సరదాగా గడిపారు. తిరిగి మే నెలలో ఇంటికి వస్తానని చెప్పి కార్తీక్ డ్యూటీకి వెళ్లారని గ్రామస్థులు తెలిపారు.జమ్మూకశ్మీర్ లో నిన్న సైనికులు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో చిత్తూరు జిల్లాకు చెందిన జవాన్ కార్తీక్ మృతి చెందారు. బంగారువాండ్లపల్లె మండలం ఎగువ రాగిమానుపెంటకు చెందిన కార్తీక్ ముష్కరులను ఎదుర్కొంటూ తీవ్రంగా గాయపడి వీరమరణం చెందారు. ఆయన మృతి పట్ల అందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ సీఎం జగన్ కూడా సంతాపం వ్యక్తం చేశారు. కార్తీక్ మృతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని చంద్రబాబు అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కార్తీక్ కు సంతాపం ప్రకటిస్తూ... ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జగన్ స్పందిస్తూ... కార్తీక్ చూపించిన ధైర్యసాహసాలకు, త్యాగానికి శాల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఈ కష్ట సమయంలో కార్తీక్ కుటుంబానికి అండగా నిలుద్దామని చెప్పారు. కార్తీక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దు

### : జనసేన కేంద్ర కార్యాలయం

అమరావతి,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ):

లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలని టీడీపీ నేతలు కోరుకోవడంలో తప్పు లేదని... తమకు కూడా పవన్ ను సీఎంగా చూడాలని ఉందని వారు కౌంటర్ అటాక్ ఇచ్చారు. ఇప్పటికే ఈ అంశంపై దృష్టి సారించిన టీడీపీ హైకమాండ్ వివాదానికి ముగింపు పలికే విధంగా చర్యలు తీసుకుంది. ఈ అంశంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడొద్దని పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేసింది.

మరోవైపు ఇదే అంశంపై జనసేన కేంద్ర కార్యాలయం కూడా స్పందించింది. డిప్యూటీ సీఎం అంశంపై జనసేన నేతలు, కార్యకర్తలు బహిరంగంగా మాట్లాడొద్దని, సోషల్ మీడియాలో స్పందించవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికైనా ఈ వివాదానికి ముగింపు పడుతుందేమో వేచి చూడాలి.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లు,వాటి ద్వారా చెల్లింపులు,సెక్యూరిటీ డిపాజిట్లు,ప్రవేటీకరణ విధానం ఉపసంహరించుకోవాలి

**ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ కు,వినతి పత్రం ఇచ్చిన పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం**

కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): పాత మీటర్ల స్థానంలో కొత్త విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానంపై సవరణ డ్రాప్ట పై అభ్యంతరాలు తెలియజేస్తూ కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలోని ఏపీ ఇఆర్సీ భవన్ లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ మరియు ఫైనాన్స్ మెంబర్ పివిఆర్ రెడ్డి గార్లకు పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. 1.1.2025 తేదీన గౌరవ కమిషన్ వారు జారీ చేసిన పబ్లిక్ నోటీస్ ప్రకారం అభ్యంతరాలు తెలిపాము. ఈ ప్రతినిధి బృందంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, సివి వర్మ, ఎండి యూనుస్, బి వన్నూరు సాహెబ్, జి శివ ప్రసాద్ చౌదరి, నాసిర్ అహ్మద్ ఖాన్ ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లను తొలగించి.. కొత్త స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడం వాటి ద్వారా విద్యుత్




బిల్లుల చెల్లింపులు..సెక్యూరిటీ డిపాజిట్లు తదితర విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఇప్పటికే విద్యుత్ పంపిణీ కోసం ప్రభుత్వం అనుమతి పొందిన మూడు సంస్థలు ఏపీ ఎస్ పి ఎస్ సి ఎల్, ఏపీ సీపీడీసీఎల్, ఏపీ ఈ పీ డీ సీ ఎల్ ఉండగా మరో ప్రైవేటు సంస్థకు లైసెన్సులు ఇస్తున్నట్లు



తెలిసిందని.. దీనివల్ల విద్యుత్ రంగాన్నే ప్రైవేటీకరించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ఈ ఆర్ సి చైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ కోసం మరో కొత్త ప్రైవేటు సంస్థకు లైసెన్సు ఇవ్వడం లేదని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ఆలోచన కూడా లేదని హామీ ఇచ్చారు. ఏపీ ఈ ఆర్ సి సెక్రెటరీ మాట్లాడుతూ మీరిచ్చిన అభ్యంతరాలన్నీ రికార్డ్ చేస్తామని తెలిపారు.

# బ్రహ్మశ్రీ రావు సాహెబ్ పండిత రామమూర్తి 133 జయంతి



**కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్):** బ్రహ్మశ్రీ రావుసాహేబ్ పండి ఆత గానాల రామ మూర్తి 133 వ జయంతి పురస్కరించుకుని కర్నూలు నగరంలో బిసి భవనం ప్రాంగనం నందు బీసీ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బీసీ స్టూడెంట్ ఫేడేరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి. ఆనంద్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా నక్కలమిట్ట శ్రీనీవాసులు, పట్నం రాజేశ్వరి, శేషఫణి, వై నాగేశ్వరరావు యాదవ్, భరత్ కుమార్, నంది విజయలక్ష్మి, అస్పరి శ్రీనివాసులు, బ్రహ్మయ్య ఆచారి, చంద్రశేఖర్ ఆచారి, కుబేరస్వామి, విద్యార్థి నాయకులు రాజేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొని బ్రహ్మశ్రీ రావుసాహేబ్ పండిత గానాల రామ మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడము జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ బ్రహ్మశ్రీ రావుసాహేబ్ పండిత గానాల రామ మూర్తి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో MLC గా చేస్తూ విశ్వబ్రాహ్మణులను బీసీ కులాల్లో చేర్చిన మహనీయుడు. ఈరోజు విద్యా ఉద్యోగాల్లో విశ్వబ్రాహ్మణులు రిజర్వేషన్లు అనుభవిస్తున్నారు అంటే ఆ మహనీయుడు బ్రహ్మశ్రీ రావుసాహేబ్ పండిత గానాల రామ మూర్తి వల్లే కావున మన బీసీ కులాల్లో ప్రతి ఒక్కరం మన మహనీయుల స్పూర్తితో ఐఖ్యమత్యముతో హక్కులను సాదించుకునే అవకాశం ఉంది. విశ్వబ్రాహ్మణులు ఐఖ్యమత్యముతో, సమన్వయంతో మన హక్కులు, రిజర్వేషన్ల సాధనకు కృషి చేయాలని పిలుపునివ్వడం జరిగింది.పగడాల ఆనంద్ బాబు, రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్.ధనుంజయ ఆచారి,బీసీ ఫెడరేషన్, రాష్ట్ర అధ్యక్షుడు. తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటిస్తూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి





**కర్నూలు ప్రతినిధి జనవరి 21(రిపబ్లిక్ న్యూస్):** నగరపాలక ముఖ్యమైన విభాగాల్లో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నగరపాలక సంస్థ కార్యాలయ మేనేజర్ ఎన్.చిన్నరాముడు అన్నారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలోని పన్ను వసూళ్లు, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విభాగాలను మేనేజర్ ఆకస్మిక తనిఖీ చేశారు. నిత్యం ప్రజలు వచ్చే విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. పనివేళ్ళలో తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండటం విధిగా భావించాలని, వచ్చే ప్రజలకు సంతృప్తి స్థాయిలో పనిచేసి పెట్టాలని సూచించారు. చిన్నపాటి కారణాలు చూపి ప్రజలను పదేపదే తిప్పుకోవద్దని, ఆయా విభాగాల్లో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, వచ్చిన సమస్యలను తక్షణమే సంబంధింత అధికారులకి చేరవేయాలని మేనేజర్ ఆదేశించారు.

# అధ్వానమైన రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోండి





**కర్నూలు ప్రతినిధి జనవరి21(రిపబ్లిక్ న్యూస్)** నగరంలో అధ్వానంగా తయారైనా రహదారులకు మరమ్మత్తులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నెహ్రూ నగర్, రాధాక్రిష్ణ థియేటర్ రోడ్డు, జమ్మిచెట్టు, వడ్డేగిరి, డాక్టర్స్ కాలనీ, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఆయా కాలనీల్లో ధ్వంసమైన రహదారులు, మురుగు కాలువలను పరిశీలించి, అవసరమైన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గార్గేయపురం డంప్‌యార్డులో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చేస్తున్న డ్రోన్ సర్వేను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్.ఈ. జి.రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, డిఈఈ క్రిష్ణలత, గంగాధర్, కార్పొరేటర్ ఫర్హాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక బరోసా

**- జిల్లా టిడిపి అధ్యక్షులు,పాలకుర్తి తిక్కారెడ్డి వెల్లడి**





**కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్)** విశాఖ ఉక్క ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటును గత వై.సి.పి. ప్రభుత్వం నష్టాలను బూచిగా చూపి విక్రయించేందుకు, తన అనుయాయులకు భూములు కట్టబెట్టేందుకు జగన్మోహన్రెడ్డి కుట్రచేశారనీ, అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తెలుగుదేశంపార్టీ యం.యల్.ఎ. యం.పి.లు ఇద్దరు కూడా స్టీల్ ప్లాంటును ప్రయివేట్ పరంకాకుండా కాపాడుకుంటామని ప్రజలకిచ్చిన హామీ మేరకు తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు కేంద్రంలోని బి.జె.పి. యన్.డి.ఎ. కూటమి ప్రభుత్వాన్ని ఒప్పించి 11,440 నిధులను కేంద్రం మంజూరు చేసేలా కృషిచేశారనీ తెలుగుదేశంపార్టీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలియజేశారు. ఈ రోజు జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వై.నాగేశ్వరరావుయాదవ్, కె. నాగేంద్ర, యస్. ముంతాజ్ మరియు ఇతర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన పత్రికా మీడియా సమావేశంలో వారు మాట్లాటడం జరిగింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్రనే కాక యావత్త ఆంధ్రప్రదేశ్ మణిహారం విశాఖ కార్మాగారం అని వేలాది మంది తెలుగు పోరాటాల పలితంగా సాధించుకున్నారనీ. అయితే గత జగన్మోహన్రెడ్డి ప్రనుత్వం దీనికి సంభందించిన భూములను విక్రయించి సొమ్ము చేసుకోవాలన్న ఆలోచనతో పనిచేశారు. జగన్ ఆనాడు కేంద్రంలోని ప్రభుత్వాన్ని కేవలం తన స్వార్ధం కోసం తన కేసులకోసం వాడుకున్నారనీ తనపై ఉన్న కేసులనుండి విముక్తికల్పించాలని డీల్లిలోని పెద్దల కాళ్ల, వేళ్లా పడ్డారు కానీ ఒక్క రోజు కూడా విశాఖ ఉక్క ప్రస్తావన తేలేదనీ అన్నారు. అదే ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హస్తిన పర్యటనకు వెళ్లి వచ్చిన ప్రతిసారి ఏదో ఒక గుడ్న్యూస్తో తిరిగి ఆంధ్రరాష్టానికి వస్తున్నారు. ప్రతి ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్ధ్యమున్న స్టీల్ ప్లాంట్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అప్పుల్లో కూరుకుపోయేలా తయారైంది. యన్.డి.ఎ. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్యరాంధ్ర అభివృద్ధితోపాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృషిటపెట్టింది. ఈ సంక్షోభం నుండి గట్టేక్కాలంటే 1800 కోట్ల ఆర్థిక సహాయం అవసరమని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి కుమారస్వామి దృష్టికి శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు, విశాఖ యం.పి, భరత్ గారు తదితదరులు విన్నవించడం జరిగింది. ఇందు నిమిత్తం కేంద్రం మొత్తం 500 కోట్లు ఒకసారి మరోసారి 1150 కోట్లు చొప్పున మొత్తం 1650 కోట్లను మొత్తం రెండు విడతల్లో ఆర్థిక సహాయాన్ని అందించింది. స్టీల్ ప్లాంటును ఆర్థిక సంక్షోభం నుండి చంద్రబాబు కృషిఫలితంగా కేంద్రం సహాయాన్ని అందజేసిందన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్పాయి మాట్లాడి 1650 కోట్లు తీసుకొని వచ్చి విశాఖ ఉక్కును పరిరక్షించారనీ గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేవలం ఉత్తరాంధ్రనే కాక రాయలసీమను రతనాల సీమగా మార్చాలన్న సంకల్పంతో ముఖ్యంగా కర్నూలు జిల్లాను పారిశ్రామిక కారిడార్గా అభివృద్ధి చేస్తున్నారనీ, అలాగే రైతుల కష్టాలను గట్టెక్కించేందుకు సాగు, త్రాగునీటి ప్రాజెక్టును తీసుకొని వచ్చారనీ, ప్రస్తుతం పోలవరం బనగచర్ల కోసం కృషిచేస్తున్నారనీ, తెలియజేశారు. వై.సి.పి. తప్పుడు కూతలతో ఎంత దుష్ప్రచారం చేసినా వారి మాటలను ప్రజలు విశ్వసించరనీ అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి. రవికుమార్, డి. జేమ్స్, పెరపోగు రాజు, షేక్షావలి, బజారన్న, మొదలగు పాల్గొన్నారు.

# లెనిన్ ఆశయ సాధన కోసం పనిచేద్దాం

**లెనిన్ 101 వ వర్ధంతి - సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ వెల్లడి**







**కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ):** విశ్వ మానవాళి విముక్తి కోసం పోరాడి రష్యాలో మొట్టమొదటి దోపిడీ లేని కార్మిక రాజ్యాన్ని స్థాపించి మానవ సమాజానికి కొత్త మార్గాన్ని చూపించిన మహనీయుడు వీఐ లెనిన్ అని ఆయన తెలిపారు. ఆయన కమ్యూనిస్టు కార్యకర్తలు అంకితమై పని చేయాలని ఆయన తెలిపారు. ఈరోజు స్థానిక సుందరయ్య భవన్లో లెనిన్ 101వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. మొదట లెనిన్ చిత్రపటానికి నాయకుల పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా cpm న్యూ సిటీ కార్యదర్శి టి రాముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి గౌస్ దేశ మాట్లాడుతూ ఆనాటి సోవియట్ యూనియన్ లో ఉన్న జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా కార్మిక రంగంలో అనేక పోరాటాలు నిర్వహించి విప్లవ మార్గాన్ని చేపట్టిన వ్యక్తి లేనినని, ఆయన 60 సంవత్సరాల జీవితకాలంలో ఎక్కువ భాగం జైల్లో అజ్ఞాతంలో గడిపారని ఆయన కొనియాడాడు. నాడు రష్యాలో వివిధ గ్రూపులుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసి విప్లబాటలను నడిపిన వ్యక్తి, కారల్ మార్క్స్ సిద్ధాంతాన్ని మొట్టమొదటిసారిగా ఆచంలో పెట్టిన వ్యక్తి ఇది నిజమేనని ఆయన తెలిపారు. అందుకోసం ప్రపంచవ్యాప్తంగా మార్క్సిజం, లేనినిజం అనే నానుడి వచ్చిందని ఆయన తెలిపారు. నాడు రష్యాలో అనేక రకాల విచ్చిన శక్తులను అధిగమించి అక్కడున్న బోల్స్ వీక్ పార్టీని ఐక్యంగా ముందుకు నడిపి విప్లవ మార్గాన్ని చూపించిన వ్యక్తి అని ఆయన తెలిపారు. ఆయన ఆయన మార్గాన్ని ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త అనుసరించాలని ఆయన తెలిపారు.

# క్లిష్ట సమయంలో సరైన మార్గాన్ని చూపిన గొప్ప అన్వేషి కామ్రేడ్ లెనిన్

**: ఎం రాజశేఖర్**



**కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్)** క్లిష్ట సమయంలో సరైన మార్గాన్ని చూపిన గొప్ప అన్వేషి అని కామ్రేడ్ లెనిన్ అని కొనియాడారు. ప్రపంచ కార్మిక వర్గ శ్వాస కామ్రేడ్ లెనిన్ అని గొప్పగా వివరించారు.కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి ముగింపు సభ సందర్భంగా స్థానిక గడియారం హాస్పిటల్ ఎదురుగా ఉన్న హరికిషన్ సింగ్ సుర్జీత్ భవాన్ నందు డి అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శి, ఎం రాజశేఖర్ ,నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ ఎం డి షరీఫ్ లు ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 22న 1870 న జన్మించిన లెనిన్ 1984 జనవరి 21వ తేదీన అస్తమించడం అనేది జరిగిందని వారు తెలియజేశారు. మానవాళి సకల కష్టాలకు, కన్నీళ్ళకు మూలమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒకవైపు పోరాడుతూనే మరోవైపు ,విప్లవ పార్టీ నిర్మాణం కోసం అంతర్గత విరోధులతో ఏకకాలంలో పోరాడి, విజయం సాధించిన నిజమైన సవ్యసాచి కామ్రేడ్ లెనిన్ అని కొనియాడారు. కారల్ మార్క్స్ శాస్త్రీయంగా సిద్ధాంతికరిస్తే, దోపిడీదారుల పెట్టుబడి రాజ్యాంగ యంత్రాంగం అండతో తిమింగలం, లాగా మారిన సామ్రాజవాదాన్ని, మత వ్యవస్థలను ఎదిరించి సోషలిజాన్ని సాధించాడు. కార్మికుల చైతన్యాన్ని, తక్కువ చేసి మాట్లాడేవారికి , ఆర్థిక పోరాటాలే కీలకమని భావించే వారికి, పరిస్థితుల సాకుతో పనులు వాయిదా వేసే వారికి, చిన్న విజయాలను చూసి గర్విష్టులుగా మారేవారికి, మార్క్సిజానికి వక్ర భాష్యాలు చెబుతూ, కార్యకర్తల్లో గందర గోళాలు సృష్టిస్తూ అహంకారం ఉన్న వారికి ,తన ఆచరణ ద్వారా, రచనల ద్వారా చెంప చెల్లమనివించేవాడు కామ్రేడ్ లెనిన్.వాస్తవానికి కామ్రేడ్ లెనిన్ అసలు పేరు వ్లదిమీర్ ఇలియచ్ ఉల్యానోవ్ . మార్క్స్ ,ఎంగెల్స్ రచించిన అనేక గ్రంథాలను చదవడంతోపాటు, కమ్యూనిస్టు ప్రణాళికను రష్యా భాషాలోకి అనువదించాడు కామ్రేడ్ లెనిన్ అన్నారు.ఈ క్రమంలో తన అన్న అనుసరించిన మార్గం సరైంది కాదని, దీనివల్ల కార్మికుల, ప్రజల బాధలు తీరవని నిర్ధారణకు వచ్చాడు లెనిన్.మధ్యలో ఆగిపోయిన యూనివర్సిటీ కోర్సును 18 నెలల్లోపు పూర్తి చేసి న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించాడు . అది ఎక్కువ కాలం కొనసాగలేదు అని వారు తెలియజేశారు. లెనిన్ విప్లవ కార్యాచరణను నాటి రష్యా రాజధాని సెంట్ పీటర్ బర్గ్ లో కొనసాగించేందుకు అక్కడకు వెళ్లాడు. అక్కడ జరుగుతున్న కార్మికుల పోరాటాల్లో పాల్గొంటూ, నాయకులతో పరిచయాలను పెంచుకొని కార్మిక వర్గానికి విప్లవ రాజకీయ పార్టీ అవసరమని వారి ముందు ప్రతిపాదన పెట్టాడు. నాటి నుండి రష్యాలో జార్జ చక్రవర్తులను ఓడించి సోషలిజం సాధన కోసం ఎన్నో ఉద్యమాలను పోరాటాలను యుద్ధాలను చేసి ఎర్రజెండా ఎగిరేటట్టు చేసిన మహానీయుడు కామ్రేడ్ లెనిన్ అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇక్బాల్ హుస్సేన్, ఇంతియాజ్, సలీం భాష, ఇలియాజ్, అక్బర్ భాష,ఈశ్వర్, ముస మియ్య తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నందు

# నూతన వెల్‌నెస్ క్లినిక్‌ను ప్రారంభం




కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్) సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్వర్ణ ఆంధ్ర విజన్ -2047ను రూపొందించిన, విక్షిత్ భారత్ ఫ్రేమ్‌వర్క్‌కు లో భాగంగా ఈ రోజు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన వెల్‌నెస్ క్లినిక్‌ను KMC ప్రిన్సిపల్, డా. చిట్టి నరసమ్మ గారి చేతుల మీదగా ప్రారంభించినట్లు తెలిపారు.ఆధునిక జీవనశైలి లో మధుమేహం, రక్తపోటు మరియు గుండె, స్థూలకాల కాయం, కిడ్నీ వ్యాధుల వంటి పరిస్థితుల దృష్ట్యా తమ ఆరోగ్యాన్ని చురుగ్గా నిర్వహించడానికి మరియు ముందస్తుగా వచ్చే అనారోగ్యా సమస్యలను నివారించడానికి ఈ ఒపి సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ప్రజలకు తెలిపారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగము లో ఉండే వైద్య సిబ్బంది మరియు వైద్య నిపుణులు, డైటీషియన్లు, మెడికల్ సోషల్ వర్కర్, నర్సింగ్ సిబ్బందితో ఈ క్లినిక్ ఒపి 333 లో ప్రతి సోమవారం మరియు బుధవారం ఔట్ పేషెంట్ ఒపి సేవలు అందుబాటులో ఉంటాయి అని అన్నారు. కార్యక్రమానికి వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్, డా.శ్రీరాములు, సీఎస్ఆర్ఎంఓ, డా.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్, పి.సింధు సుబ్రహ్మణ్యం, SPM విభాగాధిపతి, డా.సుధ కుమారి, SPM ప్రొఫెసర్, సింధియా శుభప్రద, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డా.శివ బాల నగాంజన్, డా.కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్, సావిత్రి బాయి, మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నట్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు, తెలిపారు.




## సీఎం చంద్రబాబు కృషితో

# విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థిక భరోసా

**- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



**కర్నూలు ప్రతినిధి జనవరి 18 రిపబ్లిక్ న్యూస్ :** ఉత్తరాంధ్రకే గాక యావత్ ఆంధ్ర రాష్ట్రానికి మణిహారం విశాఖ కర్మాగారమని, వేలాది మంది తెలుగు వారు కలిసి పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ అని, విశాఖ ఉక్కు పరిశ్రమను పునరుజ్జీవింప జేయడానికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.మంగళవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఓ ప్రకటనలో తెలుపుతూ నాపై ఉన్న కేసుల నుంచి నాకు విముక్తి కల్పించండని, కావాలంటే మా రాష్ట్రాన్ని తాకట్టుపెడతానని గత సీఎంగా జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ వెళ్ళేవారని, నేడు అందుకు భిన్నంగా సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్ళి వస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్ళి వచ్చిన ప్రతీసారి ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్తునే ఉందని, నేడు ఆర్థిక సంక్షోభంలో పూడుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడేందుకు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినేట్ కమిటీ ఆమోద ముద్ర వేసిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలి, ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తే, విశాఖ ఉక్కును ఏ విధంగా పరిరక్షించాలని సీఎం చంద్రబాబు ఆహర్నిశలు శ్రమిస్తున్నారని ఆమె అన్నారు.

ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తికి సామర్ధ్యమున్న విశాఖ స్టీల్ ప్లాంట్ గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అప్పుల్లో కూరుకుపోయిందని, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ఉమ్మడి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే రూ.18 వేల కోట్లైన అవసరమని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు, ఎంపీ భరత్ తదితరులు విన్నవించిన కొద్ది రోజులకే ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడి సరుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్లు చొప్పున మొత్తం రూ.1,650 కోట్లను రెండు విడతల్లో కేంద్రం ఆర్థిక సాయం అందించిందని, నేడు స్టీల్ ప్లాంట్ ను సంక్షోభం నుంచి ఆదుకునేందుకు చంద్రబాబు కృషికి ఫలితంగా రూ.11,440 కోట్లు సాయాన్ని కేంద్ర ప్రకటించడం అభినందనీయమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

1994లో నష్టాల పేరుతో బీఐఎస్ఆర్ ప్రమాదం ఏర్పడితే.. దాన్ని అధిగమించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి పునర్వ్యవస్థీకరణ జరపకుండా.. ప్లాంట్లను అమ్మడానికి ప్రయత్నించిందని . అందుకు ఎర్రన్నాయుడు నేతృత్వంలో టీడీపీ ఎంపీలు పోరాటంతో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. 1998లో నాటి ప్రధాని అటల్ బిహారి వాజిపేయ్ తో మాట్లాడి రూ.1,650 కోట్లు తీసుకువచ్చి విశాఖ ఉక్కును పరిరక్షించారని, కేంద్ర ప్రభుత్వమిచ్చిన రుణాన్ని ఈక్విటీగా మార్చాలని, రుణంపై వడ్డీని మాఫీ చేసి బీఐఎఫ్ఆర్కు వెళ్ళకుండా తప్పించాలని టీడీపీ ఎంపీలు కోరడంతో నాటి ఉక్కు శాఖ మంత్రి నవీన్ పట్నాయక్ రూ.1,333 కోట్ల రుణాన్ని ఈక్విటీగా మార్చడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ సమగ్రాభివృద్ధి కోసం కన్సల్టెంట్ను కూడా ఏర్పాటు చేశారని, ఉక్కు కర్మాగారానికి రికార్డు స్థాయిలో లాభాలు వచ్చేలా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేయడం జరిగిందని, 2002లో అప్పటి కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొనడం జరిగిందని ఆమె వివరించారు. అప్పుడు నష్టాల్లో ఉన్నప్పుడు కాపాడింది... నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో నుంచి స్టీల్ ప్లాంట్ను గట్టెక్కించింది సీఎం చంద్రబాబే నని, తప్పుడు కూతలతో వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా వారి మాటలను వినే పరిస్థితుల్లో ప్రజలు లేరని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ముమ్మర తనిఖీలు

**ప్రస్తుతం జరిగే నేరాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు**

**అక్రమ రవాణా కు అడ్డుకట్ట వేసేందుకు విస్తృత తనిఖీలు**






నంద్యాల క్రైం, జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్): విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృత తనిఖీలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ మద్యం ,పిడిఎస్ రైస్ , గంజాయి మొదలగు వాటిని అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు విసిబుల్ పోలీసులు నిర్వహించడం జరుగుతుంది. పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ ల పరిధిలలో సైబర్ క్రైమ్ ,రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ వాడకం వల్ల జరిగే నష్టాలు ,మహిళలపై జరిగే నేరాలు మొదలగు వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో నేరనియంతరణ శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విసిబుల్ పోలింగ్ తనిఖీలు ఆయా గ్రామాలలో పోలీసు అధికారులు వారి సిబ్బందిచే ఫుట్ పెట్రోలింగ్ నిర్వహణ చేయడం జరిగింది.

# గ్రూప్-1 మెయిన్స్ తేదీలను ప్రకటించిన ఏపీపీఎస్సీ

**మే 3 నుంచి 9 వరకు గ్రూప్-1 మెయిన్స్**

**మెయిన్స్ కు అర్హత సాధించిన 4,496 మంది అభ్యర్థులు**

**ఈసారి ట్యాబ్ లలో ప్రశ్నాపత్రం**

APPSC
Andhra Pradesh
Public Service Commission

అమరావతి,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నేడు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించింది. మే 3 నుంచి 9వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించింది. గ్రూప్-1 మెయిన్స్ కు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసినట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు. గ్రూప్-1 మెయిన్స్ కు 4,496 మంది అర్హత పొందినట్టు వివరించారు. ఈసారి మెయిన్స్ ప్రశ్నాపత్రాన్ని ట్యాబ్ లలో ఇవ్వాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.2023 డిసెంబరులో 89 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. 2024 మార్చి 17న గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించారు. అయితే, ప్రిపేర్ అయ్యేందుకు మరింత సమయం కావాలని అభ్యర్థులు కోరడంతో మెయిన్స్ పరీక్షలు మేలో నిర్వహించాలని నిర్ణయించారు. విశాఖ, అమలాపురం, విజయవాడ, తిరుపతిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

## అసంఘటిత కార్మికులు

# ఈ- శ్రామ్ పోర్టల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**- సహాయ కార్మిక అధికారి.. సారా మార్గరెట్.**

వెలుగోడు జనవరి 21 రిపబ్లిక్ న్యూస్ అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ఈ- శ్రామ్ పోర్టల్ ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, అసంఘటిత కార్మికులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు కార్మిక శాఖ సహాయ అధికారి సార మార్గరెట్ తెలిపారు. కావున భవన కార్మికులు, వలస కార్మికులు, ఇండ్లలో పనిచేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారస్తులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, మత్స్య కార్మికులు, ఉపాధి వేతనదారులు, లఘు వ్యాపారస్తులు తదితర కార్మికులందరూ ఈ- శ్రామ్ పోర్టల్ లో నమోదు తీసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా సంఘటనలు జరిగితే ఒక్కొక్క వ్యక్తికి రెండు లక్షల రూపాయల భీమ పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎనిమిది మంది కార్మికులకు 16 లక్షల రూపాయలను చెల్లించడం జరిగిందన్నారు. కార్మిక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సంఘటిత కార్మికులను నమోదు చేయుటకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

## ముంబైలో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ

# పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యయన పర్యటన

**- పాల్గొన్న ఎం.పి బస్తిపాటి నాగరాజు**







**కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్)** మహారాష్ట్ర రాష్ట్ర రాజధాని ముంబైలో మంగళవారం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యయన పర్యటన నిర్వహించింది.. ఈ పర్యటన లో కమిటీ సభ్యుడైన కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు..పర్యటన లో భాగంగా కమిటీ ఛైర్మన్ కనిమొళి కరుణానిధి అధ్యక్షత న కమిటీ సభ్యులు ముంబైలో ప్యాక్ చేసిన వస్తువులను నియంత్రించడం, బేబీ ఫుడ్స్ మరియు ఇతర ఆహార పదార్థాలలో చక్కెర కంటెంట్‌పై దృష్టి సారించడంపై సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్, పెప్సికో ఇండియా, కోకా-కోలా ఇండియా, నెస్లే ఇండియా, డానోన్ ఇండియా, మోండెల్జ్ ఇంటర్నేషనల్ (ఇండియా) మరియు అబాట్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఏడిపై విద్యార్థి




**కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్)** 23 నుండి 25 వరకు విజయవాడ లో జరగబోయే రాష్ట్ర స్థాయి జూనియర్ విలువిద్య ఛాంపియన్‌షిప్ లో ఏడిఫై పాఠశాల విద్యార్థి వర్షిత్ ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్ డేవిడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లా కర్నూలు జిల్లా విలువిద్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలలో మా పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న వర్షిత్ ఉత్తమ ప్రతిభను కనబడచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు,శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో కోచ్ వంశీకృష్ణ ,కోఆర్డినేటర్స్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాయితీలకు ఈ-పంటనే ప్రామాణికం.

**బహుళ పంటలతో రైతులకు లాభాలు. - ఏఓ పవన్ కుమార్.**




తెలుగోడు జనవరి 21 రిపబ్లిక్ న్యూస్ వెలుగోడు మండలం మాధవరం మోత్కూరు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ లో మండల పరిధిలోని రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వం అందించే రాయితీలకు అర్హులవుతారని అన్నారు.ఏకపంట కాకుండా బహుళ పంటలు వేసుకోవడం వలన రైతులకు ఆర్థికంగా లాభాలు ఉంటాయని తెలిపారు.మినుము పంటలో పల్లాకు తెగులు ఉధృతి ఉన్నచోట సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, వరి పంట సాగులో సూడోమోనస్ బయోఫస్టిసైడ్ పిచికారి చేసుకోవడం వలన నెల రోజుల నుంచి సంక్రమించే తెగుళ్లు 20 నుంచి 30 రోజుల పాటు తగ్గించుకోవచ్చునని అన్నారు. నార కొసలు తుంచి నాటుకోవడం వలన కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించుకో వచ్చునని, అంతే కాకుండా పిలకలు అధికంగా రావడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి గ్రామ సెరికల్చర్ సహాయకులు నాగలింగం పలువురు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు





**కర్నూలు ప్రతినిధి జనవరి21 (రిపబ్లిక్ న్యూస్):**కర్నూలు ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని, కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదేశాల మేరకు, మంగళవారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత అంశం మీద వ్యాస రచన పోటీ, భారతదేశ ఎన్నికల మరియు ప్రజాస్వామ్యం నందు యువత పాత్ర అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభా కనబరిచిన విద్యార్థులు, ఈ నెల 23వ తేదీ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం నాడు ఉన్నతాధికారులచే విజేతలు బహుమతులు, ప్రశంస పత్రాలు అందుకోనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ డబ్ల్యూ.ధనుంజయ, అధ్యాపకులు జావా గంగాధర్, జ్ఞానేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.- కర్నూలు నగరపాలక సంస్థ

## అభ్యుదయ కవితలు,కథలకు ఆహ్వానం: అరసం



కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్) అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో అరసం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి ,వల్లూరు శివప్రసాద్ ల పర్యవేక్షణలో కవితలు మరియు కథలతో కూడిన రెండు పుస్తకాలను ప్రచురిస్తున్నట్లు అరసం కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలం ప్రహ్లాద్, కొత్తపల్లి సత్యనారాయణలు పత్రికా ప్రకటనలో తెలియజేశారు .కనుక కర్నూలుజిల్లావాసులైన కవులు,రచయితలు అభ్యుదయ సామాజికలి నేపథ్యంతో కూడిన కవితలను కథలను రాసి పంపవలసినదిగా కోరారు. కథల విషయంలో మాత్రం ఇంతవరకు పుస్తక ప్రచురణకు నోచుకోని నూతన కథకులకు మాత్రమే అవకాశంలి ఉంటుందని తెలిపారు. ఈ సదా అవకాశాన్ని కర్నూలు జిల్లా అభ్యుదయ కవులు రచయితలు సద్వినిగం చేసుకోవాలని కర్నూలు జిల్లా కవులకు,రచయితలకు కోరారు. వివరాలకు జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్ సెల్ నంబర్ 9985355456 ను సంప్రదించాలని తెలిపారు.

## 11 వ రోజు పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహధారుడ్య పరీక్షలు

### కానిస్టేబుల్ మెయిన్స్(ఫైనల్) పరీక్షకు 267 మంది అభ్యర్దులు ఎంపిక.

కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిస్ న్యూస్) పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా కు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు APSP రెండవ బెటాలియన్ లో 11 వ రోజు దేహదారుడ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ దేహాదారుడ్య సామర్థ్య పరీక్షలను కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్ ఐపియస్ గారు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ రోజు 600 మంది అభ్యర్దులను పిలిచారు. 412 మంది అభ్యర్థులు బయోమెట్రిక్ కు హజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు.అనంతరం వీరందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ లు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు



నిర్వహించారు. 1600 మీటర్ల పరుగు పరీక్షలో 309 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.100 మీటర్ల పరుగు పరీక్షలో 189 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.లాంగ్ జంప్ లో 263 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.
కానిస్టేబుల్ మెయిన్స్(ఫైనల్) పరీక్షకు 11 వ రోజు



267 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు హెూంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డిస్పీలు, సిఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, డిపిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 277 సర్వే నెంబర్ లో డి.రాజవర్ధన్ రెడ్డి కాలనీ గా నామకరణం :లక్ష్మన్న



**కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్):**బి.తాంద్రపాడు గ్రామ ప్రజలకు సర్వే నెంబర్ 277లో ఇచ్చిన ఇండ్ల పట్టాలకు సరిహద్దులు ఏర్పాటు చేయాలని తాంద్రపాడు గ్రామ ఉద్యమ నాయకులు లక్ష్మన్న ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. కర్నూలు సమీపంలోని బీ. తాంద్రపాడు గ్రామంలో 2013 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు1300 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇచ్చారని వాటికి సంబంధించిన సరిహద్దులు (రాళ్లు) ఏర్పాటు చేయలేదని వారు తెలిపారు. మంగళవారం లక్ష్మన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇంటి స్థలాల వద్దకు వెళ్లి 277 సర్వే నెంబర్ భూమికి డి.రాజావర్ధన్ రెడ్డి కాలనీ గా నామకరణం చేసి బోర్డు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి గ్రామస్తులు అందరూ పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈసందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేయడంతో రెవెన్యూ అధికారులు స్పందించారని తెలిపారు. 277 సర్వే నెంబర్ ను సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారులు త్వరగా వచ్చి సర్వే చెయాలని ఆయన కోరారు. కోడుమూరు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇంచార్జి డి. విష్ణు వర్ధన్ రెడ్డి సహకరించి రాజావర్ధన్ రెడ్డి కాలనీ లబ్ధిదారుల ఇండ్లకు సంబంధించిన సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరారు

## బీజేపీ ఏపీ కొత్త జిల్లా అధ్యక్షులు



వెలగపూడి
బీజేపీ ఏపీ జిల్లాల అధ్యక్షులను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలను బీజేపీ నిర్వహించింది.
.మొత్తంగా 24 జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికైన వారికి ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ%ో% ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీ సంస్థాగత ఎన్నికలు జరిగాయని తెలిపారు. నేతలు ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.
ఏపీకి కేంద్రం అన్నివిధాలా సాయం అందిస్తోందని చెప్పారు. గత ఐదేళ్లు పోలవరంలో చిటికెడు మట్టి కూడా వేయలేదన్నారు. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ప్రారంభమైందని పురంధేశ్వరి పేర్కొన్నారు
.ఏపీ బీజేపీ జిల్లాల అధ్యక్షులు వీరే..పార్వతీపురం మన్యం జిల్లా ద్వారపురెడ్డి శ్రీనివాసరావు , అల్లూరి సీతారామరాజు జిల్లా ( అరకు)మఠం శాంతకుమారి శ్రీకాకుళం జిల్లా సిరిపురం తేజేశ్వరావు. విజయనగరం జిల్లా ఉప్పలపాటి రాజేష్ వర్మ విశాఖపట్నం జిల్లా మంతెన పరుశురాంరాజు,, అనకాపల్లి జిల్లా. ద్వారపురెడ్డి పరమేశ్వర రావు,. కాకినాడ జిల్లా బిక్కిన విశ్వేశ్వరరావు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అడబాల సత్యనారాయణ. తూర్పు గోదావరి జిల్లా. పిక్కి నాగేంద్ర. పశ్చిమ గోదావరి జిల్లా ఐనంపూడి శ్రీదేవి, ఏలూరు జిల్లా చౌటపల్లి విక్రమ్ కిషోర్. ఎన్టీఆర్ జిల్లా. అడ్డూరి శ్రీరాములు . గుంటూరు జిల్లా. చెరుకూరి తిరుపతిరావు. పల్నాడుజిల్లా. ఏలూరి వెంకట మారుతి శశి కుమార్, ఒంగోలు జిల్లా సెగ్గం శ్రీనివాసులు. నెల్లూరు జిల్లా పారెడ్డి వంశీధర్ రెడ్డి. తిరుపతి జిల్లా సామంచి శ్రీనివాసరావు. అన్నమయ్య జిల్లా వసంత సాయి లోకేష్, చిత్తూరు జిల్లా సూరపనేని జగదీశ్వర్ నాయుడు, కడప జిల్లా. జంగిటి వెంకట సుబ్బారెడ్డి. సత్యసాయి జిల్లా. గోరంట్ల మోహన్ శేఖర్, . అనంత పూర్ జిల్లా కొనకొండ్ల రాజేష్, కర్నూలు జిల్లా. బాపురం రామకృష్ణ పరమహంస. నంద్యాల జిల్లా అభిరుచి మధు

## పంటల సాగు..ఈ పంట నమోదు తప్పనిసరి




రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారిని స్వాతి

**బండి ఆత్మకూరు, జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్):-** రబీ సీజన్లో సాగుచేసిన పంటల వివరాలు రైతన్నలు ఈ పంట నమోదు (ఈ క్రాప్ బుకింగ్) తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని స్వాతి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిని రైతులకు పంటల సాగు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతన్నలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రైతులు రవి సీజన్లో సాగు చేసిన పంటలను గడువులోగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. ఈ క్రాప్ నమోదు వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, సంక్షేమ ఫలాలు పొందే అవకాశం ఉంటుందని ఆమె చెప్పారు. అనంతరం ఆమె క్షేత్రస్థాయిలో పైర్లను పరిశీలించి పంటలకు పట్టిన తెగుళ్ల నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సామ్రాట్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు

### - ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి

**బండి ఆత్మకూరు, జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్):-** ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జి. లింగాపురం గ్రామంలో ఆమె ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. సున్నా నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులందరికి ఆధార్ నమోదు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో




ఆధార్ నమోదు కేంద్రం పరిశీలిస్తున్న సూపర్వైజర్

భాగంగా ఈనెల 22న నారాయణపురం, 23న కడమల కాలువ, 24న ఏ.కోడూరు, 27న పార్నపల్లి, 28న బండి ఆత్మకూరు, 30న సంత జూటూరు గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. వీటిని ఆయా గ్రామాల ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పుట్టుక,మరణాలతో వ్యాపారం

### నేటి కథ...

కర్నూలు ప్రతినిధి జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్) సృష్టిలో ప్రతిజీవికి పుట్టుక,మరణం సాధారణం.అందులో మనిషి పుట్టుక, మరణాలను ప్రత్యేకంగా గౌరవిస్తారు.అదే అదనుగా కొందరు స్వార్థపరులు వ్యాపారానికి ఏది అనర్హత కాదు అన్న సూక్తిని ప్రజల్లో పెద్దఎత్తున ప్రచారం చేసుకొని పుట్టుక,మరణాలపై కూడా వ్యాపారం మొదలుపెట్టారు.అందులో కొందరు వ్యాపారులు మానవీయ విలువలతో వ్యాపారం చేస్తున్నారు. మరోవైపు నిట్టనిలువుగా బహిరంగంగా దోపిడీ కొనసాగిస్తున్నారు.ఈ వ్యాపారాన్ని ఎవరు ప్రశ్నించలేరు.దీంతో ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న దోపిడీ పట్ల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవు. నిజాయితీగా వ్యాపారం చేసే వారు నేటికీ అదే మార్గంలో పయనిస్తున్నారు.అలాంటి వారిపై దోపిడీ దారులు తప్పుడు ప్రచారాలతో గుర్తించలేని స్థాయికి ప్రజల కళ్ళకు గంతలు కట్టేశారు.నీతిగా వ్యాపారం చేసే వారిని ప్రజలకు తెలియచేయాలనే ఈ కథ కొందరిలోనైనా మార్పు తెస్తుందనే నమ్మకం.కథలోకి వెళితే...వీరన్నది చిన్న పల్లెటూరు.ఆయన వృత్తి సాంప్రదాయ వైద్యం.పిల్లలు పుట్టేటప్పుడు,మరణం తలపెడితే,వీరన్నను పిలుస్తారు.ఆయన సేవలు ప్రతి ఇంట్లోనూ ఉన్నాయి.కొత్త శిశువు తొలి కేకలు వినిపించినా, శోకసమయంలో చివరి పలుకులు నిలిచినా వీరన్నే వుండేవాడు.అతని వృత్తి కేవలం కర్మకాండమే కాదు,ఒక విధంగా వ్యాపారమే. పుట్టుక,మరణం సంభవించినప్పుడు, ఆయన సేవలు అందించేవాడు.పుట్టుక జరిగితే,తల్లి-బిడ్డ ఆరోగ్యంగా ఉంటే, కుటుంబం ఆనందంతో వీరన్న చేతికి బహుమానాలు ఇస్తుంది.మరణం సంభవిస్తే, పాడే,విగ్రహం,చివరి కార్యక్రమాల కోసం అతనిని ఆధారపడేవారు.అయితే,ఈ వృత్తి ఒక్కసారి అతనిలో కొన్ని ప్రశ్నలు మొలకెత్తాయి.ఒక









రోజు,పుట్టుకకు సహాయం చేసిన కుటుంబం,రెండువారాల తర్వాత తిరిగి వచ్చి,బిడ్డ చనిపోయిందని కన్నీళ్లు తీశారు.మరణం తర్వాత ఏర్పాట్లు చేయమని కోరింది.మరో కుటుంబం రెండు రోజుల తరువాత మరో శిశువుకు జన్మనిచ్చింది.వీరన్నకు ఇది కంటికి కనిపించని చక్రంలా అనిపించింది. "జీవితం, మరణం కేవలం నా చేతుల్లోని వ్యాపార పద్ధతులుగా మారుతున్నాయా ?" అని తనను తాను ప్రశ్నించుకున్నాడు.ఆ రోజు నుంచి వీరన్న తన పని విధానం మార్చుకున్నాడు.పుట్టుకలో ఒక ధనాత్మక మార్పు తీసుకురావడం,మరణంలో బాధను తగ్గించడమే తన నూతన లక్ష్యమని నిర్ణయించుకున్నాడు.ప్రతి పుట్టుకతో గ్రామంలో ఒక మొక్క నాటించడం ప్రారంభించాడు.మరణం జరిగితే,ఒక రహస్యంగా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసేవాడు.కొద్ది కాలంలో గ్రామం పచ్చదనంతో నిండిపోయింది.జనాలు మరణాన్ని నెమ్మదిగా స్వీకరించడం, పుట్టుకను మరింత ఆనందంగా జరుపుకోవడం మొదలుపెట్టారు.ఆ గ్రామానికి వీరన్న సేవలు వ్యాపారం కాదు,జీవితానికి ఆశ వెలుగులు ప్రసాదించే పునాది అయ్యాయి.

**సారాంశం :**
**జీవితం,మరణం ఒక వలయంలా తిరిగినప్పటికీ, మనుషుల మధ్య ఉన్న మానవీయ విలువలే జీవితానికి నిజమైన అర్థం ఇస్తాయి.**

# రాముడి విగ్రహాన్ని ధ్వంసం చేసినోళ్లకు రూ.5 లక్షలా?

అమరావతి,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ. ఇటీవల కాలంలో ఎప్పుడూ లేనంతగా కూటమి సర్కారుపై నిప్పులుచెరిగారు. అంతేకాదు.. ఇప్పుడు ఆయన నోటి నుంచి వచ్చిన వ్యాఖ్యలకు కూటమి ప్రభుత్వం క్లారిటీ ఇవ్వక తప్పనిసరి పరిస్థితిని క్రియేట్ చేశారని చెప్పాలి. ఇంతకూ ఆయన చేసిన వ్యాఖ్యను చూస్తే.. కాస్త గందరగోళానికి గురి చేసేలా ఉండటం గమనార్హం. ఇంతకూ బొత్స ఏమన్నారంటే.. "మూడేళ్ల క్రితం రామతీర్థం ఆలయంలో రాముడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో ఏ2గా ఉన్న నిందితుడికి సాక్షాత్తూ అదే ఆలయానికి ధర్మకర్తగా ఉన్న మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా సీఎం సహాయ నిధి రూ.5 లక్షలు ఇచ్చారు. ఇదే కార్యక్రమంలో జిల్లా మంత్రితో పాటు.. స్థానిక ఎమ్మెల్యే.. ఇతర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు" అంటూ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అక్కడితో ఆగని ఆయన మరిన్ని వ్యాఖ్యలు చేశారు. ఆ ఘటన జరిగినప్పుడు తమ ప్రభుత్వం అతడిపై రాజకీయ ఉద్దేశంతో కేసు పెట్టినట్లుగా కూటమి సర్కారు బావిస్తే.. ఆ అంశాన్ని విచారణ జరపాలన్నారు. ఆ కేసును వెనక్కి తీసుకొని.. తప్పుడు కేసు పెట్టిన సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. 'ఒకవేళ అతను నిందితుడే కాదని చెప్పదల్చుకుంటే.. కూటమి ప్రభుత్వం అసలు నిందితుడ్ని పట్టుకొని చట్టం ముందు నిలబెట్టాలి. అదేమీ లేకుండా ప్రజల సొమ్మును సీఎం సహాయనిధి నుంచి నిందితుడికి ఇచ్చి



ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నారు. నిందితుడికి డబ్బులు ఇవ్వటం మీ ఉద్దేశమా?' అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తార్లు. ఇంత దారుణం జరుగుతుంటే హిందూ సనాతనవాదిగా గొప్పగా ప్రకటించుకున్న పవన్ కానీ.. హిందూ మతానికి బ్రాండ్ అంబాసిడర్ గా ప్రచారం చేసుకునే బీజేపీలు ఏం చేస్తున్నాయి? వారెందుకు నోరు విప్పటం లేదు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఈ ఘటన జరిగినప్పుడు దేవుడి మీద అలవిమాలిన భక్తిని ప్రదర్శించిన మీరు నానా హంగామా చేశారు. ఇప్పుడు అదే కేసులో నిందితుడికి సాయం చేస్తుంటే.. ఆ పాపంలో మీ పాత్ర కూడా ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయి' అంటూ విరుచుకుపడ్డారు. ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వంపై ఫోకస్ పెట్టాలన్న బొత్స.. హామీల్ని కచ్చితంగా నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాల్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని.. విజయవాడలో వరదలు.. తిరుమలలో తొక్కిసలాటలు.. ఇవన్నీ మానవ తప్పిదాలేనంటూ స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ఫ్లాంట్ కు ప్రత్యేక ప్యాకేజీ అంటూ అర్భాటంగా ప్రచారం చేస్తున్నారని.. కానీ ప్యాకేజీ పేరుతో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వేగంగా అడుగులు పడుతున్నట్లుగా అనుమానాల్ని వ్యక్తం చేశారు. మొత్తానికి సంచలన వ్యాఖ్యలు చేసిన బొత్సకు సమాధానం ఇవ్వటం ద్వారా రాష్ట్ర ప్రజలకు క్లారిటీ ఇవ్వాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబు అండ్ కో మీద పడిందని చెప్పకతప్పదు.

# కేంద్రం నుంచి బడ్జెట్ కేటాయింపులపై ఆశ

### రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులపై శాఖల కసరత్తు



అమరావతి,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): కేంద్రం ప్రవేశ పెట్టే బడ్జెట్లో ప్రతిపాదనలకు సింబంధించి ఇప్పటికే నివేదికలు అందచేశారు. కేంద్రం నుంచి వివిధ రంగాలకు రాబట్టాలనుకున్న మొత్తాలకు లెక్కలు వేసి పంపించారు. ఇక రాష్ట్ర బడ్జెట్లో కేటాయింపులకు సంబంధించి కసరత్తుచేస్తున్నారు. వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కోసం అన్ని శాఖలు కసరత్తు ముమ్మరం చేస్తున్నాయి. కీలక శాఖల నురచి ఇరదుకోసం భారీ ప్రతిపాదనలే సిద్ధమవుతున్నట్లు తెలుస్తోరది. అది ఎంతలా అరటే కేటాయిరపులకు వీలు కాని విధంగా ఈ ప్రతిపాదనలు ఉరటున్నట్లు సమాచారం. వాస్తవానికి కావాల్సిన మొత్తం కన్నా అధికంగా నిధులు కోరుతున్నట్లు తెలిసిరది. ప్రధానంగా కొన్ని పెద్ద శాఖలు సిద్ధం చేస్తున్న ప్రతిపాదనలైతే వేల కోట్లలో ఉరటున్నట్లు సమాచారం. ఫిబ్రవరి మూడో వారంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికోసం ఇప్పటికే అన్ని శాఖలకు ఆర్థికశాఖ నిర్దిష్ట మార్గదర్శకాల తో సర్క్యులర్ జారీ చేసిరది. ఏయే రంగాల్లో, ఎలారటి తరహాలో ప్రతిపాదనలు పంపిరచాలన్నది కూడా స్పష్టం చేసిరది. అనేక శాఖలు ఈ మార్గదర్శకాలను పట్టిరచుకోకుండానే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారర. ప్రధానంగా నీటిపారుదల, పంచాయితీరాజ్, పట్టణాభివృద్ధి, విద్య, వైద్యం వంటి శాఖలు తయారుచేస్తున్న ప్రతిపాదనలు పరిమితి దాటి ఉరటున్నట్లు తెలిసింది. అలాగే చిన్న చిన్న శాఖలు కూడా అవసరాలకు మిరచే ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోరది. గతేడాది వ్యయానికి అనుగుణంగానే కొత్త ప్రతిపాదనలు ఉరడాలన్నది ఆర్థికశాఖ మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొంది. కేటాయిరచిన నిధులు ఎరత, విడుదల చేసిన మొత్తం, అరదులో ఖర్చు చేసినది ఎరత అన్నది అధ్యయనం చేసిన తరువాతే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్దేశించింది.

# ట్రంప్ దూకుడు నిర్ణయాలు

### పలు అంశాలపై కీలక ఆదేశాలు - దస్త్రాలపై వెనువెంటనే సంతకాలు

వాషింగ్టన్,ఐ: రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే డొనాల్డ్ ట్రంప్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పారిస్ ఒప్పందం నుంచి బయటకు రావడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగడం, దేశంలో వాక్ స్వాంతంత్యం÷-రపై ఉన్న సెన్సార్ తొలగింపు, కొన్ని రోజులపాటు అధికారులు ఎలాంటి ఆదేశాలు జారీ చేయకుండా ఉత్వర్వులు జారీ చేశారు. జో బైడెన్ ప్రభుత్వం జారీ చేసిన దాదాపు 78 నిర్ణయాలను రద్దుచేస్తూ డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ జారీ చేశారు. చైనా నుంచి పనామా కాలువను తిరిగి చేజిక్కుంచుకుంటామని స్పష్టం చేశారు. దాంతో చైనాతో వివాదానికి ముగింపు పలికే ప్రసక్తే లేదనే సంకేతాలు వచ్చాయి. కొన్ని ఉత్వర్వులు జారీ చేసిన అనంతరం ట్రంప్ కొన్ని పెన్నులను గాల్లోకి విసరగా అక్కడున్న వారు వాటిని అందుకునేందుకు పోటీ పట్టారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లుగా ప్రకటిస్తూ ఉత్వర్వులపై ట్రంప్ సంతకం చేశారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తొలిరోజే డబ్యూహెచ్వోతో సంబంధాలను తెంచుకోవడం ఆయన తీసుకున్న కీలక నిర్ణయాలతో ఒకటి. మెక్సికో గల్ఫ్ను అమెరికా గల్ఫ్గా పేరు మార్చే ప్రక్రియ ప్రారంభ మైంది. ఇందుకు సంబంధిచిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. చైనా ఉత్పత్తులపై



ప్రస్తుతానికి మినహాయింపు ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్.. మెక్సికో, కెనడాలపై ఉక్కుపాదం మోపారు. ఫిబ్రవరి 1 నుంచి మెక్సికో, కెనడా ఉత్పత్తులపై 25 శాతం పన్నులు విధిస్తూ ట్రంప్ ఉత్వర్వులు జారీ చేశారు. సరిహద్దులో అక్రమ వలసల్ని నివారించకపోతే తీవ్ర నిర్ణయాలు తీసుకుంటానని ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. గతంలో అమెరికాలో జన్మించే పిల్లలకు దేశ పౌరసత్వం లభించేది. ఈ చట్టాల్లో సవరణ తీసుకొస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. దేశంలోకి తల్లిదండ్రులు అక్రమంగా ప్రవేశిస్తే.. వారికి జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం ఇవ్వకూడదని ప్రకటించారు. ఇప్పటివరకూ దేశంలోకి అక్రమంగా వచ్చిన వారికి పుట్టిన సంతానానికి సైతం పౌరసత్వం లభించేలా ఉన్న అమెరికా చట్టాలలో ట్రంప్ ప్రభుత్వం మార్పులు తీసుకొస్తుంది. అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ ఎన్నిక అనంతరం క్యాపిటల్ లో జరిగిన దాడి కేసులో ఇరుక్కున్న రిపబ్లికన్లకు ఊరట కల్పించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణం చేసన ట్రంప్ ఎన్నికల హామీ మేరకు 2021 జనవరి 6 నాటి దాడుల్లో పాల్గొన్న 1500 మందికి క్షమాభిక్ష కల్పిస్తూ, వారిపై పెండింగ్లో ఉన్న కేసులు కొట్టివేయాలని అటార్నీ జర్నల్ను ఆదేశించారు. బైడెన్ హయాంలో దేశంలో వాక్ స్వాతంత్యం÷-రపై కొంతమేర నియంత్రణ ఉండేది. చట్టప్రకారం హద్దు దాటి మాట్లాడేందుకు అవకాశం లేదు. తాజాగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ దేశంలో వాక్ స్వాతంత్యం÷-రపై సెన్సార్ తొలగిస్తూ సంతకం చేశారు. చైనా ఆధీనంలో ఉన్న పనామా కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు.పరిపాలనలో తనకు పూర్తి నియంత్రణ వచ్చే వరకు అధికారులు సొంతంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేయకుండా ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు.

# దావోస్లో తెలంగాణ పెట్టుబడుల వేట

### కామారెడ్డిలో పామాయిల్ యూనిట్ ఏర్పాటు - తెలంగాణ ప్రభుత్వంతో యూనిలీవర్ ఒప్పందం

హైదరాబాద్,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు యూనిలీవర్ ముందుకు వచ్చింది. ఇక్కడ పామాయిల్ పెంపకం కారణంగా యూనిట్ పెట్టాలని దావోస్లో జరిగిన సమావేశంలో సిఎంరేవంత్ చేసిన సూచనలను అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్ల తయారీ యూనిట్ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నది. దావోస్లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వేట ప్రారంభమైంది. ఈ మేరకు ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్లో యూనిలీవర్ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు ,అధికారుల బృందం మంగళవారం సమావేశమయ్యారు. యూనిలీవర్ వంటి గ్లోబల్ దిగ్గజ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం చర్చించారు. ఈ మేరకు దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం చేసుకున్నారు. యూనిలివర్ కంపెనీ గ్లోబల్




సీఈవోతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు. తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలీవర్ ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్ల తయారీ యూనిట్ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్బాబు ఉంటారు. సింగపూర్లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా దావోస్లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం.. అక్కడ తెలంగాణ పెవిలియన్ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరీలతో రేవంత్ బృందం సమావేశమైంది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించింది. మరోవైపు దావోస్లో పలు అంతర్జాతీయ సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భేటీ కానున్నారు.

# మహాకుంభమేళాలో భారీగా పాల్గొంటున్న భక్తులు

### లక్షలాదిగా తరలివచ్చి పుణ్యస్నానాలు

### 50 లక్షల మందికి అన్నదానం చేయనున్న ఆదానీ

ప్రయాగ్రాజ్,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): ఉత్తరప్రదేశ్లోని ప్రయాగ్రాజ్ జిల్లాలో మహా కుంభమేళా మరింత వైభవంగా జరుగుతోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన, ప్రాముఖ్యమైన ఆధ్యాత్మిక సంఘటన లలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఈ మహాకుంభమేళాకు భారత్తోపాటు విదేశాల నుంచి కూడా కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. దీంతో కుంభమేళా ప్రపంచవ్యాప్తంగా సాంప్రదాయాలకు, ఆధ్యాత్మికతకు గౌరవాన్ని పెంచుతుంది. ఈసారి ఈ మహా సంగమంలో దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ కూడా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ మహాకుంభ మేళా వేడుకలకు ఓ ప్రత్యేకత తీసుకురాబోతున్నారు. ఆయన త్రివేణి సంగమంలో పూజలు నిర్వహించిన అనంతరం, 50 లక్షల మందికి ప్రసాదం పంపిణీ చేయబోతున్నారు. ఈ ప్రసాదాన్ని ఆయన స్వయంగా తన చేతులతో పంపిణీ చేయనున్నారు. అదానీ గ్రూప్, ఇస్కాన్, గీతా ప్రెస్ల సహకారంతో, మహాకుంభ మేళాలో లక్షలాది మందికి ఉచిత ప్రసాదం, ఆహార సదుపాయాలను అందించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గౌతమ్ అదానీ ఈ రోజు ప్రయాగ్రాజ్ చేరుకోనున్నారు. అక్కడ ఆయన ఇస్కాన్ పండల్లో కొనసాగుతున్న భండారాలో సేవ చేస్తారు. దీంతోపాటు అదానీ గ్రూప్ పాఠశాలలు, ఆస్పత్రులు, అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ రోజు ఆయన మహాకుంభ మేళాలో 50 లక్షల మందికి ప్రసాదం పంపిణీ చేసి, సామాజిక బాధ్యతను మరింత ప్రగాఢంగా అనుభూతి చెందనున్నారు. ఈ వేడుకలు సమాజంలో ఆధ్యాత్మికత, విశ్వాసాన్ని పెంచేలా ఉంటాయని చెప్పవచ్చు. మహాకుంభ మేళాలో భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో.. అనేక మతాల, సాంప్రదాయాల సమ్మిళితంగా మనసులను సాకారం చేసేందుకు ఇది ఎంతో మంచి అవకాశం. అదానీ ప్రస్తుత కార్యాచరణతో భక్తులకు తన సేవలను అందించడంలో భాగంగా, ఇస్కాన్, గీతా ప్రెస్ వంటి సంస్థలతో కలిసి అనేక దాతృత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ మహా కుంభమేళా వేడుకల్లో పలు ప్రముఖ వ్యక్తులు కూడా పాల్గొంటున్నారు. ఇటీవలే ఇన్ఫోసిస్ గ్రూప్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, ఆయన భార్య, రాజ్యసభ ఎంపీ సుధా మూర్తి కూడా ప్రయాగ్రాజ్ చేరుకున్నారు. సుధా మూర్తి ప్రస్తుతం పరేడ్ గ్రౌండ్లో పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన మహారాజా టెంట్లో బస చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ మహా కుంభమేళాలో 8 కోట్ల 30 లక్షల మందికి పైగా భక్తులు పుణ్యస్నానం చేశారు. ఉత్తరప్రదేశ్ పోలీసులు ఈ కార్యక్రమం భద్రత కోసం స్థానిక పోలీసులు, పారామిలిటరీ దళాలతో సహా 10,000 మందికి పైగా సిబ్బందిని మోహరించారు. తదుపరి కీలకమైన 'స్నాన్' తేదీలు: జనవరి 29 (మౌని అమావాస్య - రెండవ షాహి స్నానం), ఫిబ్రవరి 3 (బసంత్ పంచమి - మూడో షాహి స్నానం), ఫిబ్రవరి 12 (మాఘి పూర్ణిమ), ఫిబ్రవరి 26 (మహా శివరాత్రి).

# ప్రకాశం ఎస్పీ ఆదేశాలతో పొలాల వద్దకు ప్రత్యేక బస్సులు

**వ్యవసాయ కూలీల కోసం మార్కాపురంలో ఆర్టీసీ బస్సుల ఏర్పాటు**

**కూలీల భద్రత దృష్ట్యా ప్రకాశం జిల్లా ఎస్పీ వినూత్న ఆలోచన**

**ఎస్పీ సూచనలను ఆచరణలో పెట్టిన ఆర్టీసీ అధికారులు**

అమరావతి,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ): రాష్ట్రంలో ఎక్కువగా కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేందుకు ఆటోలు, ట్రాక్టర్ ట్రక్కులు, ఇతర వాహనాలను ఆశ్రయిస్తుంటారు. ఈ వాహనాల్లో పరిమితికి మించి అధిక సంఖ్యలో పనులకు వెళు తున్న సందర్భాల్లో అక్కడక్కడా ప్రమాదాలు సంభవిస్తుండటం తెలిసిందే. ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతుండగా, మరి కొందరు గాయాలతో బయటపడుతుంటారు. ఇటువంటి ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ వినూత్న ఆలోచన చేశారు. వ్యవసాయ కూలీల భద్రత దృష్ట్యా పనులకు వెళ్లే సమయంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఇందుకు ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించారు.

మార్కాపురంలో మొదటిసారి వ్యవసాయ కూలీలు పొలాల వద్దకు వెళ్లేందుకు బస్సు సర్వీసును సోమవారం ప్రారంభించారు. డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో కూలీలను మార్కాపురంలోని పలు ప్రాంతాల నుంచి పెద్దారవీడు, తర్లుపాడు, కంభం, డోర్నాల, అర్ధవీడు, బెస్తవారిపేట, కొనకనమిట్ల మండలాలకు పంపించారు.

ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. కూలీల భద్రత దృష్ట్యా ఎస్పీ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పరిధిలో బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ మాధవరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# మహారాణి యేసుబాయిగా రష్మిక.. స్టన్నింగ్ లుక్




భారతీయ చరిత్రలో మహారాజ శంభాజీ బోంస్లే వ్యక్తిత్వం, వీరోచిత గాథలు ప్రధాన అంశాలుగా హైలెట్ అయ్యాయి. ఈ నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని "చావా" అనే చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమా ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ జీవిత కథను తెలుపుతోంది. అతని ధైర్యం, త్యాగం, దేశభక్తిని ఈ చిత్రంలో ప్రతిబింబించనున్నారు. ప్రముఖ నటుడు విక్కీ కౌశల్ శంభాజీ పాత్రలో నటిస్తుండగా, అక్షయే ఖన్నా కీలక పాత్రలో కనిపించబోతున్నారు. దినేష్ విజన్ నిర్మాణంలో మ్యాడ్ డాక్ ఫిల్మ్స్ బ్యానర్ పై ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్ర ట్రైలర్ జనవరి 12న విడుదల కానుండగా, సినిమా ఫిబ్రవరి 14న థియేటర్లలో సందడి చేయబోతోంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. హిస్టారికల్ డ్రామాలో ఉన్న డిటైలింగ్, గ్రాండియర్ విజువల్స్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని మేకర్స్ అంటున్నారు. రెహమాన్ సంగీతం ఈ సినిమాకు మరింత హైలైట్‌గా నిలవనుంది. ఇక శంభాజీ జీవితంలో అతని భార్య యేసుబాయి పాత్రకు ఎంత ప్రాధాన్యం ఉందో సినిమా ద్వారా ఆవిష్కరించనున్నారు. ఇటీవల కాలంలో రష్మిక మందన్న వరుస విజయాలు అందుకుంటూ దూసుకుపోతోంది. పుష్ప 2 లో ఆమె నటన ప్రేక్షకులను ఉర్రూతలూగించగా, ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 1800 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. ఇప్పుడు చావాలో ఆమె పాత్ర కూడా చిత్రానికి ప్రాణం పోసేలా ఉంటుందని చెబుతున్నారు. హిస్టారికల్ డ్రామాలో నటించడం రష్మికకు కొత్త అనుభవం. ఆమె అందించిన నటన, హావభావాలు సినిమా బలాన్ని మరింత పెంచుతాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. యేసుబాయి పాత్రలో రష్మిక మందన్న కొత్తగా నిలుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇటీవల విడుదల చేసిన పోస్టర్ లో ఆమె లుక్ అందర్నీ ఆకట్టుకుంది. రాజసంగా అలంకరించిన ఆమెను చూస్తుంటే, ఒక మహారాణి ఆత్మవిశ్వాసం, సంస్కారం స్పష్టంగా ప్రతిఫలించింది. ఆమె ధరించిన దుస్తులు, ఆభరణాలు హిస్టారికల్ అక్షరాల్లో వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉన్నాయి. ఆ పోస్టర్ చూసిన వెంటనే యేసుబాయి పాత్రపై ప్రేక్షకులలో ఒక కొత్త ఆసక్తి పెరిగింది. చావా సినిమా చరిత్రలో కీలకమైన పాత్రలతో ప్రేక్షకుల మనసులు గెలుచుకునేందుకు సిద్ధంగా ఉందని అనిపిస్తోంది. ఈ సినిమా విజువల్స్, కథ, రష్మిక పాత్ర చిత్రణ ప్రేక్షకులను ఉర్రూతలూగించనుంది. రష్మిక తన పాత్రకు ఏ విధంగా ప్రాణం పోస్తుందో, ఆమె నటన ఈ సినిమా విజయానికి ఎంత పెద్ద శక్తిని అందిస్తుందో చూడాలి. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా, హిస్టారికల్ డ్రామాలలో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

# ఆసుపత్రి నుంచి సైఫ్ అలీఖాన్ డిశ్చార్జ్



కత్తిపోట్లకు గురైన బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ముంబయి లీలావతి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. కాసేపటి క్రితం ఆయన ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిపోయారు. కాగా, ఈ నెల 16న బాంద్రాలోని సైఫ్ నివాసంలో దుండగుడు కత్తితో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. సైఫ్ ఇంట్లో దొంగతనానికి ప్రయత్నించిన ఆగంతుకుడు ఆయనపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాడు. దీంతో ఐదు రోజుల పాటు లీలావతి ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందారు. సైఫ్ కోలుకోవడంతో ఈరోజు ఆయనను వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఇక సైఫ్ అలీఖాన్‌పై దాడికి పాల్పడిన నిందితుడిని ముంబయి పోలీసులు ఆదివారం నాడు థానేలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు బంగ్లాదేశ్‌కు చెందిన షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్‌గా పోలీసులు గుర్తించారు. అయితే, అతడు తన పేరు మార్చుకుని, అక్రమంగా ఇండియాలో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం నాడు అధికారులు సైఫ్ నివాసాన్ని సందర్శించి క్రైమ్ సీన్‌ను రీక్రియేట్ చేశారు.

# నేరుగా ఓటీటీకి వచ్చేస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్!

ఓటీటీ ఆడియన్స్ ను పలకరించడానికి ఇప్పుడు మరో సస్పెన్స్ థ్రిల్లర్ రెడీ అవుతోంది. ఆ సినిమా పేరే 'వైఫ్ ఆఫ్'. రాహుల్ తమడ-సాయిదీప్ రెడ్డి నిర్మించిన ఈ సినిమాకి భాను దర్శకత్వం వహించాడు. థియేటర్లలోనే ఈ సినిమాను విడుదల చేయాలనుకున్నారు. కానీ చివరి నిమిషంలో ఓటీటీకి వదులుతున్నారు. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను 'ఈటీవీ విన్' సొంతం చేసుకుంది. నేరుగా ఈటీవీ విన్ నుంచి ప్రేక్షకులను ఈ సినిమా పలకరించనుంది. ఈ నెల 23వ తేదీ నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ మొదలవుతుంది. ఈ విషయాన్ని అధికారికంగా తెలియజేస్తూ, అందుకు సంబంధించిన పోస్టర్ ను వదిలారు. దివ్యశ్రీ- అభినవ్ మణికంఠ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాలో... నిఖిల్, సాయిశ్వేత, వీర్, కిరణ్ ఇతర పాత్రలలో కనిపించనున్నారు. కథ విషయానికి వస్తే... 'అవని' తన బావకి మనసిస్తుంది. అతనితో తన జీవితం అందంగా సాగిపోతుందని భావిస్తుంది. అయితే వివాహమైన దగ్గర నుంచి అతను అవనిని హింసిస్తూ ఉంటాడు. అతని ఆగడాలు అంతకంతకూ శృతిమించిపోతూ ఉంటాయి. అప్పుడు అవని ఏం చేస్తుంది? ఆ తరువాత ఏం జరుగుతుంది? అనేది కథ.




# బాలయ్య తో తాండవం కృష్ణానదిలోనే ప్లాన్ ?



నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో అఖండ తాడవం శర వేగంగా చిత్రీకరణ జరుపుకుంటోన్న సంగతి తెలిసిందే. డాకు మహారాజ్% రిలీజ్ తో సంబంధం లేకుండా బాలయ్య తాండవాన్ని పట్టాలెక్కించి బిజీ అయ్యారు. ఇప్పటికే తొలి షెడ్యూల్ కూడా పూర్తయింది. ఆర్ ఎఫ్ సీలో బాలయ్య సహా ప్రధాన తారాగణంపై కీలక యాక్షన్ వేశాలు చిత్రీకరించారు. అటుపై రెండవ షెడ్యూల్ కూడా హైదరాబాద్ లోనే పట్టా లెక్కించారు. దీనిలో భాగంగా బాలయ్య పై కొన్ని సోలో సన్నివేశాలు చిత్రీకరించారు. తాజాగా తదుపరి షెడ్యూల్ కి బోయపాటి రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా బోయపాటి అండ్ కో లోకేషన్ల వేటలో పడింది. ఈ షెడ్యూల్ లో కొన్ని కీలక సన్నివేశాలను కృష్ణాజిల్లా పరివాహాక ప్రాంతంలో ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో పర్యటించి అక్కడ లోకేషన్లను చూసారు. నందిగామ నియోజక వర్గం చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామం వద్ద కృష్ణానదీ ప్రాంతాన్ని పరిశీలించారు. సెలయేరు..కొండగుట్టలతో నిండియన ఎంతో ఆహ్లాదాకరమైన వాతావరణం. ఆ ప్రాంతంలో సమీప విలేజ్ అన్ని ఎంతో సహజసిద్ధంగా ఏర్పడ్డాయి. బోయపాటితో పాటు ఆర్ట్ విభాగానికి సంబంధించిన వారు ఉన్నారు. అంతా ఒకే అనుకుంటే గనుక తదుపరి షెడ్యూల్ ఇక్కడే మొదలవుతుందని తెలుస్తోంది. సరిగ్గా కృష్ణానది మధ్యలో బోయపాటి భారీ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇలాంటి ప్రదేశాల్లో యాక్షన్ సన్నివేశాల్ని తీర్చి దిద్దడంలో బోయపాటి స్పెషలిస్ట్. అలాంటి సన్నివేశాలతో అభిమానుల్లో ఊపు తేవడం అన్నది బోయపాటి ప్రత్యేకత. జయజానకి నాయకలోనూ హీరో సాయి శ్రీనివాస్ తో కృష్ణానదీ ప్రాంతంలోనే ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించి సినిమాకి హైలైట్ గా చేసిన సంగతి తెలిసిందే. అలాంటిది బాలయ్య తో యాక్షన సీన్ అంటే మామూలుగా ఉంటుందా.

# అనుపమ కెరీర్ మళ్లీ రివర్స్ అవుతోందా?

మాలీవుడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ఫుల్ స్వింగ్ లో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. కెరీర్ ముగిసింది అనుకుంటోన్న సమయంలో 'రౌడీ బోయ్స్' తో ఒక్కసారిగా ఫేమస్ అయింది. ఇండస్ట్రీలో మడి కట్టుకుని కూర్చుం టే పనవ్వదని భావించిన అమ్మడు తనలో సిసలైన నటిని తట్టి లేపి సంచలమైంది. అప్పటి నుంచి మాలీవుడ్ అందానికి తిరుగులేదు. గత ఏడాది 'టిల్లు స్క్వేర్' తో గ్రాండ్ సక్సెస్ అందుకుంది. ఆ సినిమా వంద కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. అయితే ఈ సక్సెస్ టాలీవుడ్ కంటే ఇతర భాషల్లోనే ఎక్కువగా అవకాశాలు తెచ్చి పెట్టినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం అమ్మడి లైనప్ చూస్తే తెలుగు కంటే మాలీవుడ్, కోలీవుడ్ లోనే ఎక్కువగా సినిమాలు చేస్తోంది. తెలుగులో 'పరదా'లో నటిస్తోంది. ఇది లేడీ ఓరియేంటెడ్ చిత్రం. ఈ సినిమా సక్సెస్ అయితే గనుక అనుపమ కెరీర్ మరో కొత్త టర్నింగ్ తీసుకుంటుంది. సోలో నాయికగా మరిన్ని అవకాశాలు అందు కోవడానికి ఛాన్స్ ఉంది. ఇక మాలీవుడ్ లో మూడు సినిమాలు...కోలీవుడ్ లో మూడు సినిమాలు ఏక కాలంలో చేస్తూ బిజీగా ఉంది. ఇవన్నీ ఇదే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. వాటి విజయాలు అనుపమ కెరీర్ని ఆయా పరిశ్రమల్లో మరింత స్ట్రాంగ్ చేసే అవకాశం ఉంది. అయితే వచ్చిన చిక్కేంటి? అంటే అమ్మడు టాలీవుడ్ లో సూపర్ హీరోయిన్ గా వెలిగిపోవాలని కలలు కంటోంది. ఇతర భాషల తరహాలో తెలుగులో మాత్రం బిజీ అవ్వడం లేదు. రెండు..మూడు సినిమాలు చేయడం మినహా కంటున్యూగా కమిట్ అవ్వలేకపోతుంది. 2024లో 'టిల్లుస్క్వేర్' చేసింది. అంతకు ముందు ఏడాది ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. 'టిల్లు స్క్వేర్' తర్వాత వరుసగా తెలుగు సినిమాలకు సైన్ చేస్తుంది అనుకుంటే? అందకు భిన్నంగా ఇతర భాషల్లో బిజీ అయింది. ఎక్కడైనా నటి బిజీగా ఉంటే సంతోషించే అభిమానులెంతో మంది.




# జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ కమిషనరేట్ లో మాధవీలత ఫిర్యాదు



టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ పోలీసులకు సినీ నటి మాధవీలత ఫిర్యాదు చేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కు వెళ్లిన ఆమె... జేసీపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ... జేసీ ప్రభాకర్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలతో తాను ఎంతో ఆవేదనకు గురయ్యానని చెప్పారు. సినిమా హీరోయిన్లు, మహిళలపై అసభ్యకరంగా మాట్లాడి... ఆ తర్వాత క్షమాపణ చెబితే సరిపోతుందా? అని ప్రశ్నించారు. జేసీ వ్యవహరించిన తీరుతో తన కుటుంబ సభ్యులు కూడా భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. సీనియర్ రాజకీయ నాయకుడైన జేసీ ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు.

అసలేం జరిగిందంటే..?

న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబర్ 31 రాత్రి తాడిపత్రిలోని జేసీ పార్క్ లో పట్టణంలోని మహిళల కోసం ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో మహిళల కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్ కు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మహిళలు హాజరుకావద్దని చెబుతూ మాధవీలత సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్ట్ చేసింది. జేసీ పార్క్ లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటాయని... మహిళలు అక్కడకు వెళ్లవద్దని సూచింది. దీంతో, ఆమెపై జేసీ విరుచుకుపడ్డారు. మాధవీలతను ఒక ప్రాస్టిట్యూట్ అని సంబోధించారు. ఆ తర్వాత తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు.

# నంద్యాలను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దండి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, జనవరి 21, రిపబ్లిక్ న్యూస్ :- జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మొక్కుబడి రీతిలో కాకుండా ముమ్మరంగా చేపట్టి నంద్యాల జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి చెత్త సంపద తయారీ కేంద్రాలు, సామూహిక మరుగుదొడ్ల కాంప్లెక్సులు తదితర పారిశుద్ధ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్ల, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లాను స్వచ్ఛ జిల్లాగా చూపించేందుకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి స్థాయిలో సాధించాలని పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటింటి నుండి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా విభజించి చెత్త నుండి సంపద వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు పూర్తిస్థాయి శ్రద్ధ పెట్టి సంపూర్ణ పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. కొత్తపల్లి, సిరివెళ్ల, పాములపాడు, బండి ఆత్మకూరు మండలాలలో క్లోరినేషన్, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు శుభ్ర పరచడం తదితర పారామీటర్లలో వెనుకబడి ఉన్నారని పనితీరు మెరుగుపరచుకొని ప్రగతి చూపించకపోతే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విజన్ ను దృష్టిలో ఉంచుకుని ఈఓఆర్డీలు శ్రద్ధతో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టకుండా అంకెల గారడీతో మభ్యపెడితే ఊరుకునేది లేదన్నారు. జిల్లాలో 417 సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి గాను 192 పూర్తి అయ్యాయని, ఇంకా ప్రారంభించని 167, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలన్నారు. పూర్తి అయిన సామూహిక మరుగుదొడ్లను తాను స్వయంగా తనిఖీ చేస్తానని కలెక్టర్ తెలిపారు. అలాగే మంజూరైన సోకు పిట్ల నిర్మాణాలకు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 6000 రూపాయల యూనిట్ కాస్ట్ తో వ్యక్తిగత సోక్ పిట్ల నిర్మాణాల ప్రతిపాదనల మేరకు మంజూరు చేస్తామన్నారు.

# జాతీయ రహదారుల విస్తరణకు వేగవంతంగా భూసేకరణ పూర్తి చేయండి

### :సిఎస్ విజయానంద్



**అమరావతి,21 జనవరి: (రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారుల నిర్మాణం,విస్తరణ వాటిపై బైపాస్ రహదారుల నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూసేకరణను వేగవతంగా పూర్తి చేయాలని జిల్లా కలక్టర్లు,సంయుక్త కలక్టర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు.జాతీయ రహదారుల నిర్మాణం,విస్తరణ, బైపాస్ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ,అటవీ అనుమతుల మంజూరు తదితర పెండింగ్ అంశాలపై మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి రెవెన్యూ,అటవీ, టిఆర్అండ్బి,జాతీయ రహదారుల సంస్థ,మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్సుపోర్టు అండ్ హైవేస్ శాఖల అధికారులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లు,జెసిలతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జాతీయ రహదార్లు వంటి ప్రాధాన్య రహదార్ల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి సంబంధిత నిర్మాణ ఏజెన్సీలకు సకాలంలో అందించే విధంగా కలక్టర్లు,జెసిలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ,అటవీ అనుమతుల మంజూరుపై జిల్లాల వారీగా కలక్టర్లు,జెసిలతో సిఎస్ విజయానంద్ సమీక్షించారు.భూసేకరణకు సంబంధించిన నిబంధనల ప్రకారం రైతులకు నష్ట పరిహారాన్ని అందించి సకాలంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి ఆయా నిర్మాణ సంస్థలకు అందించాలని స్పష్టం చేశారు.ఈవిషయంలో వివిధ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు వీలుగా రెవెన్యూ, ఆటవీ,టిఆర్అండ్బి,జాతీయ రహదార్ల సంస్థ,మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్సుపోర్టు అండ్ హైవేస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చెప్పారు. ఈసమావేశంలో సిసిఎల్ఏ జి.జయలక్ష్మి,టిఆర్అండ్బి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే,అదనపు పిసిసిఎఫ్ రాహుల్ పాండే,ఎన్ హెచ్ ఎఐ రీజనల్ అధికారి ఆర్కె సింగ్, మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్సుపోర్టు అండ్ హైవేస్ రీజనల్ అధికారి రాకేశ్ కుమార్ పాల్గొన్నారు.అదే విధంగా వివిధ జిల్లాల కలెక్టర్లు,జెసిలు వర్చువల్ గా ఈవీడియో సమావేశంలో పాల్గొన్నారు.

# జిల్లాలో వేసవిలో త్రాగు నీటి సమస్యలు తలెత్తకూడదు

**రూ. 6.91 కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్**

**మార్చి 15వ తేది నాటికి అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నింపాలి**

**ఎంపీడీవో లు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు, ఈ వో పి ఆర్డీ లు గ్రామాలను సందర్శించి తాగునీటి సరఫరా పరిస్థితిని పరిశీలించాలి**

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




**కర్నూలు, జనవరి, 21 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో వేసవి కాలంలో త్రాగు నీటి సమస్య తలెత్తకూడదని, ఇప్పటి నుంచే తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 191 హ్యాబిటేషన్ లలో తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ. 6.91 కోట్లతో డ్రాట్ కంటింజన్సీ ప్లాన్ ను రూపొందించడం జరిగిందని, నిధులు మంజూరు కోరుతూ ఈ ప్లాన్ ను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఇవి కాక ఏవైనా చిన్న చిన్న తాగునీటి సమస్యలుంటే మండల,పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని కలెక్టర్ ఎంపిడిఓ లకు సూచించారు..గత సంవత్సరంలో ఆలూరు లో నీటి సమస్య వచ్చిందని, ఈ సారి ఇలాంటి సమస్యలు రాకుండా ముందుగా నే ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..జిల్లాలోని 33 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నింపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..గ్రామాల్లో నీటిని వృధా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మోటర్లు వాడకుండా చర్యలు తీసుకోవాలని, టెయిల్ ఎండ్ వరకు అందరికీ నీరు అందేలా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నీరు ఎక్కడ నుంచి వస్తున్నాయి ? అదనంగా నీరు ఎక్కడ నుంచైనా నీరు ఇచ్చే అవకాశం ఉందా ? ఉన్న నీటితో ఎన్ని రోజులు నీటి సరఫరా చేయవచ్చు ? ఎన్ని రోజులు నీరు సరిపోతాయి అని పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు..ఈ మేరకు ఎంపీడీవో లు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు, ఈ వో పి ఆర్డీ లు గ్రామాలను సందర్శించి తాగునీటి సరఫరా పరిస్థితిని పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.పంచాయతీ సెక్రటరీ తాగునీటి పరిస్థితిపై పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నీటిని క్లోరినేషన్ చేయాలని, 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంక్ క్లీన్ లను చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిపివో ను ఆదేశించారు.సిపిడబ్ల్యు స్కీమ్ ల నిర్వహణ సక్రమంగా జరిగేలా జిల్లా పరిషత్ సీఈవో తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

హెచ్ ఎం ఎస్ ఎస్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టు కు సరఫరా చేస్తున్న 290 క్యూసెక్కుల నీరు నష్టం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్,%ఎచీూా% ఇంజనీర్ లను ఆదేశించారు.. కోడుమూరు, గూడూరు మండలాల్లోని లోని 16 గ్రామాలకు తాగునీటి సమస్య ను తీర్చేందుకు హంద్రీ నదికి ఈ నీటిని విడుదల చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు.. స్పెషల్ ప్రాజెక్ట్ కింద జిల్లాకు 12481 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు అయ్యాయని, ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు పత్తికొండ, పెద్దకడుబూరు ఎంపిడిఓలు మాత్రమే ప్రతిపాదనలు సమర్పించారని, మిగతా ఎంపిడిఓలు కూడా శుక్రవారం లోపు ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ ఎంపిడిఓలను ఆదేశించారు. హంద్రీ నీవా నీటితో 68 చెరువులకు నీరందించడం లో భాగంగా జిల్లాలోని 39 చెరువులకు గాను ఎంఐ 33 పూర్తిగా నింపారని,మిగతా 6 చెరువులను కూడా త్వరితగతిన నింపాలని కూడా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అన్ని మండలాల ఎంపిడిఓలు, ఆర్డబ్ల్యూఎస్ ఎఈలు మండలాల్లో ఉన్న నీటి లభ్యత, తదుపరి వేసవి కాలంలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఆదోని, పత్తికొండ, కర్నూలు డివిజన్ లలో తాగునీటి సమస్యల గురించి సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ జిల్లా కలెక్టర్ కు వివరించారు.సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజశేఖర్, డిపిఓ భాస్కర్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈలు, డిఈలు, ఏఈఈలు, ఎంపిడిఓలు, ఈఓఆర్డీలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల భూసేకరణను పూర్తి చేయండి



నంద్యాల, జనవరి 21, రిపబ్లిక్ న్యూస్ :- రాష్ట్రంలోని వివిధ జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లు మరియు JC లతో పాటు రెవెన్యూ, అటవీ, TR&B, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. జాతీయ రహదారుల వంటి ప్రాధాన్య రహదారుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత నిర్మాణ సంస్థలకు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, జేసీలను ఆదేశించారు. అనంతరం జిల్లాల వారీగా కలెక్టర్లు, జేసీలతో జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, అటవీ అనుమతులపై సీఎస్ విజయానంద్ సమీక్షించారు. భూసేకరణకు సంబంధించి నిబంధనల ప్రకారం రైతులకు పరిహారం అందించాలని, భూసేకరణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి ఆయా నిర్మాణ సంస్థలకు ఇవ్వాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, అటవీ, టీఆర్అండ్‌బీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ మినిస్ట్రీ ఆఫ్ అధికారులు సమన్వయంతో పనిచేసి సకాలంలో పలు సమస్యలను పరిష్కరించాలని విజయానంద్ సూచించారు.

## "తెలుగు కీర్తి "పురస్కారం అందుకున్న రచయిత కొప్పుల



నంద్యాల జనవరి 21( రిపబ్లిక్ న్యూస్) :

శ్రీ శ్రీ కళావేదిక వారి ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన సాహితీ కార్యక్రమంలో నంద్యాలకు చెందిన వర్ధమాన రచయిత కొప్పుల ప్రసాద్ "తెలుగు కీర్తి" జాతీయ ప్రతిభ పురస్కారం మంగళవారం అందుకున్నారు .తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సాహిత్యానికి రచయిత కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని శ్రీ శ్రీ కళావేదిక అధ్యక్షుడు కత్తి మండప్రతాప్ అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బోయి భీమన్న సతీమణి హైమవతి పాల్గొన్నారు .కొప్పుల ప్రసాదు ను శాలువా, మెమెంటో, పురస్కార ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా రచయిత కొప్పుల మాట్లాడుతూ తనకు తెలుగు భాష అంటే ఇష్టమని తన సాహితీ కృషిని ఇలాగే కొనసాగిస్తానని పేర్కొన్నారు. రచయితను నంద్యాల సాహితీ మిత్రులు, సాహితీ సంఘాల ప్రతినిధులు , అంతర్జాతీయ శాస్త్రవేత్త రవీంద్రనాథ్, డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ ఉదయ శంకర్,డాక్టర్ సహదేవుడు, అన్నెం శ్రీనివాసరెడ్డి,నరేంద్ర, వివిధ కళాశాలల యాజమాన్యం, కాలేజీలెక్చరర్స్ ,అభినందనలు తెలిపారు.

# ఎపిలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి

### కూటమి ప్రభుత్వంపై నమ్మికతో ముందుకు వస్తున్నారు

### మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి




నంద్యాల,జనవరి 21 (రిపబ్లిక్ న్యూస్ ):కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామిత్తలు ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడం, కేంద్ర ప్రభుత్వం ఇటీవల విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం 11 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించడం చంద్రబాబు పరిపాలనకు నిదర్శనమని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ ఎండి ఫారుక్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ .. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నం అభివృద్ధి చెందుతున్న నగరాలలో మొదటిది. గత ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు కాకుండా పరిశ్రమలను మూసేందుకు ఎక్కువ కృషి చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఏపీ అభివృద్ధి కోసం ఇతర దేశాలలో ఉన్నటువంటి మన ప్రాంత పారిశ్రామికవేత్తల ద్వారా పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తుంది. నెల్లూరు జిల్లా రాయపట్నం ప్రాంతంలో బిపిసిఎల్ ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టులతోపాటు పిన్నాపురం గ్రీన్ పార్క్ ఓర్వకల్లు డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రాజెక్టు అలాగే నదుల అనుసంధానంతో రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృత నిశ్చయంతో ఉన్నారు. రానున్న రోజులలో ఆంధప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తుందని ఆయన అన్నారు. నంద్యాల అభివృద్ధిలో నియోజకవర్గ ప్రజలు సహకరించాలని మన నంద్యాల, మన అభివృద్ధి లో అందరం భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com